# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

17.03.2026 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 235 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana







## మాల ధరించిన విద్యార్థులకు నో ఎంట్రీ!



వివరాలు 6వ పేజీలో



# విజన్ 2047

## లక్ష్యం 3 ట్రిలియన్ డాలర్లు

- అసెంబ్లీలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా దిశానిర్దేశం
- దేశ జీడీపీకి 4.99 శాతం వాటా ఇస్తున్న తెలంగాణ..
- ఉభయ సభలను ఉద్దేశించి తెలుగులో ప్రసంగం

**హైదరాబాద్, మార్చి 16:** ప్రతి పౌరుడిని అభివృద్ధిలో భాగస్వామిని చేస్తూ, ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన చేసినట్లు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రకటించారు. సోమవారం ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తొలుత తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించిన గవర్నర్, 'విజన్ 2047' ద్వారా తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం వాటా అందిస్తోందని, తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని ఆయన వెల్లడించారు. ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానంగా మారిందని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ. 5.72 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అనే వినూత్న నమూనాలను అనుసరిస్తోందని గవర్నర్ వివరించారు.

మిగతా 2 లో

> ప్రతిపౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా బడ్జెట్‌ను రూపొందించినట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు వేస్తున్నట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అసెంబ్లీలో తొలిసారి తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఆపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయసభలను ఉద్దేశించి తెలుగులో ప్రసంగించారు. తొలుత గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడంవిశేషం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని గవర్నర్ పేర్కొన్నారు.



## 31 వరకు అసెంబ్లీ

- 20న సభల బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి
- ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు
- బీఏసీ సమావేశంలో నిర్ణయం

2

## శాసనసభ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

లాంఛనంగా ప్రారంభించిన గవర్నర్ శుక్లా

పుష్పాంజలి ఘటించిన గవర్నర్, సీఎం, మంత్రులు

2

## అన్ని రాష్ట్రాల్లోనూ గ్యాస్ నిల్వలు

- వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన

4



## యుద్ధం వేళ చైనా దూకుడు

తైవాన్ దిశగా యుద్ధనౌకలు, విమానాల మోహరింపు



4



## ఆరేళ్ల బాలికపై లైంగికదాడి హత్య

చాక్లెట్ ఆశచూపి చిన్నారిని తీసుకెళ్లిన కామాంధుడు..

సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడి అరెస్ట్

2 లో..

హైదరాబాద్ నగర శివార్లలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత హేయమైన ఘటన వెలుగులోకి వచ్చింది. మానవత్వాన్ని మంటగలుపుతూ ఆరేళ్ల పసిగుడ్డుపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడి, ఆపై గొంతు నులిమి దారుణంగా హత్య చేశాడు.

## నందిని సిధారెడ్డికి 'కేంద్ర సాహిత్య అకాడమీ' అవార్డు

- 'అనిమేష' కవితా సంపుటికి దక్కిన గౌరవం..
- సాహితీవేత్తలు, కేసీఆర్, కేటీఆర్ హర్షం

2



## ఫలక్‌నుమాలో భారీ అగ్నిప్రమాదం



- సోఫాల తయారీ కేంద్రం దహనం
- ఫరూఖ్‌నగర్ బస్‌డిపో సమీపంలో చెలరేగిన మంటలు..
- ఇతర దుకాణాలకు వ్యాప్తి

2

## సమావేశాలకు ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే

- ప్రతిపక్షాల ప్రశ్నలకు దీటుగా సమాధానం ఇవ్వాలి..
- సీఎల్పీ సమావేశానికి గైర్హాజరైన వారిపై ముఖ్యమంత్రి సీరియస్

2





3

## తెలుగు రాష్ట్రాలకు వర్షసూచన

- సిద్దిపేట జిల్లాలో వడగళ్ల వాన



# రేపు రాష్ట్రవ్యాప్తంగా ఫార్మర్ కిట్స్

**పంపిణీని ప్రారంభించనున్న మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, మార్చి 16:** రాష్ట్రంలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన రైతులకు 'ఫార్మర్ కిట్స్' పంపిణీ చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయం నుండి లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 489 క్లస్టర్లలో ఈ పంపిణీ జరుగుతుంది. ప్రతి క్లస్టర్‌కు 125 మంది చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 61,125 మంది రైతులకు ఈ కిట్లను అందజేయడం జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, గుర్తింపు కోసం ఈ కిట్‌లో క్లాత్ బ్యాగ్, క్షేత్ర దర్శిని డైరీ, గుర్తింపు కార్డు, ప్రత్యేక క్యాలెండర్, టోపీ, పెన్ను మరియు చిన్న ప్యాకెట్ డైరీ వంటి వస్తువులు ఉంటాయి. సచివాలయంలో మంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, ఆయా జిల్లాల్లోని రైతు వేదికలలో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రైతులకు ఈ కిట్లను పంపిణీ చేస్తారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

# జనాభా ప్రాతిపదికన బీసీలకు బడ్జెట్ కేటాయింపులు

**డిప్యూటి సీఎం భట్టితో బీసీ మంత్రుల భేటీ**

**హైదరాబాద్, మార్చి 16:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛాంబర్‌లో కాంగ్రెస్ బీసీ ఎమ్మెల్యేలు సోమవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మహేష్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. బీసీ ప్రైవేట్ బిల్‌పై కూడా చర్చ జరిగింది. తెలంగాణ బ్జడెట్ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సోమవారం సమావేశం అయింది. సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతలకు దిశా నిర్దేశర చేశారు. అసెంబ్లీ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఏదో ఒక సాకు చెప్పి సభ్యులు గైర్హాజరు కావద్దని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్షసూచన

**హైదరాబాద్,మార్చి16 :** తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సోమవారం వడగళ్ల వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని పలు గ్రామాలను వడగళ్ల వాన వణికించింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఉరుములు, మెరుపులతో వడగళ్ల వర్షం కురిసింది. పట్టణంతో పాటు డివిజన్ వ్యాప్తంగా జరాసంఘం, కోహిర్, న్యాల్కల్, రాయికోడ్ మండలాల్లో వర్షపు జల్లులు పడ్డాయి. ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ వర్ష సూచన చేసింది. మహారాష్ట్ర నుంచి కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతుందని వివరించింది. అందువల్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. సోమవారం నుంచి వచ్చే నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలో ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, హైదరాబాద్, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో సోమ, మంగళ, బుధవారాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఈ క్రమంలోనే సోమవారం కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ మండలం హంగర్గ గ్రామంలో వడగండ్ల వాన కురవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. మరోవైపు హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రాత్రి సమయంలో నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇదిలా ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజుల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. అలాగే, కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, రాయలసీమలోని నంద్యాల, కర్నూల్, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పలు చోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. మరోవైపు అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమలతోపాటు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఈ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

# ఆరేళ్ల బాలికపై లైంగికదాడి హత్య

**చాక్లెట్ ఆశచూపి చిన్నారిని తీసుకెళ్లిన కామాంధుడు..**

**సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడి అరెస్ట్**

**హైదరాబాద్, మార్చి 16:** హైదరాబాద్ నగరంలోని నార్సింగిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కామాంధుడు.. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. చాక్లెట్ ఇప్పిస్తానంటూ బాలికను నమ్మించి అత్యాచారం చేసి ప్రాణాలు తీశాడు. చిన్నారి ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో రాత్రి 10 గంటలకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లో బాలికను కామాంధుడు తీసుకెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో గుండెల్ని పిండేసే ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. మానవత్వం అనే విషయాన్ని మంట కలుపుతూ కేవలం ఆరేళ్ల వయసున్న ఓ చిన్నారిపై అత్యాచారం చేసి, ఆపై గొంతు నులిమి హత్య చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు నార్సింగిలో నివసించే ఆరేళ్ల బాలిక ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటూ ఉంది. అయితే ఉనట్లుంది కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్నారి అదృశ్యంపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాధితురాలి ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఒక వ్యక్తి బాలికకు చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మించి, తన వెంట తీసుకువెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ ఆధారాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి, కొద్దిసేపటికే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన దారుణానికి పాల్పడినట్లు అంగీకరించాడు. బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆపై ఎక్కడ దొరికిపోతానో అన్న భయంతో ఆమెను దారుణంగా హత్య చేసినట్లు తెలిపాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నిందితుడు చూపిన ప్రాంతంలో పోలీసులు బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

# విజన్ 2047.. లక్ష్యం 3 ట్రిలియన్ డాలర్లు

మొదటి పేజీ తరువాయి

పట్టణాభివృద్ధిలో భాగంగా జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని నాలుగు కమిషనరేట్లుగా విభజించామన్నారు. మూసీ నది ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని, మొదటి దశలో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు చేపడతామని తెలిపారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తామని, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తామని పేర్కొన్నారు. ఐటీ రంగంలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని, ఎగుమతులు రూ. 3.13 లక్షల కోట్లకు చేరి 9.39 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. సంక్షేమ రంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, ఇల్లు లేని పేదల కోసం 4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతు భరోసా కింద రూ. 9,000 కోట్లు, పంట రుణమాఫీ కోసం రూ. 20,616 కోట్లు వెచ్చించామన్నారు. మహిళా సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. లక్ష కోట్ల రుణాలు అందించేలా ప్రణాళికలు రూపొందించామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 9,222 కోట్లు ఆదా అయ్యాయని చెప్పారు. విద్యా రంగంలో సంస్కరణల కోసం అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్, నిరుద్యోగుల కోసం రికార్డు సమయంలో 67,763 ఉద్యోగాల భర్తీ చేపట్టామన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో బీఆర్ఎస్ సభ్యులు ఆరు గ్యారెంటీల అమలుపై నిరసన వ్యక్తం చేసినప్పటికీ, ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించి రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికను సభ ముందు ఉంచారు.



# శాసనసభ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

**లాంఛనంగా ప్రారంభించిన గవర్నర్ శుక్లా**

**పుష్పాంజలి ఘటించిన సీఎం, మంత్రులు**

**హైదరాబాద్, మార్చి 16:** శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పునరుద్ధరించిన మండలి భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్ర శాసనసభ ఆవరణలో రాష్ట్ర ఆత్మగౌరవ చిహ్నంగా నూతనంగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వైభవంగా ఆవిష్కరించారు. ఈ చారిత్రక ఘట్టం రాష్ట్ర ప్రముఖులు, మంత్రుల సమక్షంలో అత్యంత వేడుకగా జరిగింది. అనంతరం విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముందు ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అసెంబ్లీ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, సమాజానికి వారు చేసిన అసమాన సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ విగ్రహం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల పోరాట పటిమకు, సంస్కృతికి, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దినట్లు ఆయన పేర్కొన్నారు.



# 31 వరకు అసెంబ్లీ

**20న సభల బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి**

**ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు**

**బీఏసీ సమావేశంలో నిర్ణయం**



**హైదరాబాద్, మార్చి 16:** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.

# సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే

- **ప్రతిపక్షాల ప్రశ్నలకు దీటుగా సమాధానం ఇవ్వాలి..**
- **సీఎల్పీ సమావేశానికి గైర్హాజరైన వారిపై ముఖ్యమంత్రి సీరియస్**

**హైదరాబాద్, మార్చి 16:** శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు సమయమివ్వాలని సూచించారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దన్నారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని ప్రశ్నించారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు. ప్రజా ప్రభుత్వంలో మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన ప్రసంగంలో వివరించారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని అన్నారు. ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. సభలో మాట్లాడే అంశాలపై ప్రభుత్వ విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృథా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ హయాంలో.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని ఆగ్రహించారు. సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు తనను సభకు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని హుకుం జారీ చేశారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని మార్గనిర్దేశర చేశారు. సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఇది మన ప్రభుత్వం.. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుందని అన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి పలు సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని.. ఆది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తోందని అన్నారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు.



# ఫలక్‌నుమాలో భారీ అగ్నిప్రమాదం

**సోఫాల తయారీ కేంద్రం దహనం**

**హైదరాబాద్, మార్చి 16:** నగరంలోని ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఫరూఖ్‌నగర్ బస్‌డిపో సమీపంలో ఉన్న ఒక సోఫాల తయారీ కేంద్రంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. ఈ ప్రమాదంలో తయారీ కేంద్రంతో పాటు పక్కనే ఉన్న ఫర్నిచర్ దుకాణం, మరికొన్ని చిన్న షాపులకు మంటలు వేగంగా వ్యాపించాయి. తయారీ కేంద్రంలో సోఫాల తయారీకి ఉపయోగించే ఫోమ్, చెక్క సామగ్రి, ఇతర రసాయనాలు ఉండటంతో మంటలు నిమిషాల వ్యవధిలోనే ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ఈ ఘటనతో స్థానిక వ్యాపారులు, నివాసితులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫోమ్ వంటి పదార్థాల వల్ల మంటలు అదుపులోకి రావడం కష్టతరంగా మారినప్పటికీ, అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది శ్రమించి మంటలను నియంత్రించే ప్రయత్నం చేశారు. స్థానికులు కూడా అప్రమత్తమై కొన్ని దుకాణాల నుంచి విలువైన వస్తువులను బయటకు తరలించడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే, దుకాణాల్లోని సోఫాలు, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమవడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.






# ఆరు గ్యారెంటీలపై నిలదీస్తాం

## గన్‌పార్క్ వద్ద అమరులకు కేటీఆర్ తదితరుల నివాళి

**హైదరాబాద్, మార్చి 16:** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని.. రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పింఛన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ అసమర్ధత

## నీటి వాటాలను కోల్పోతున్నాం: హరీష్ రావు




**హైదరాబాద్, మార్చి 16:** తెలంగాణకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని ప్రతిసారి ఎత్తిచూపుతున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గోదావరి, కృష్ణా జలాల హక్కుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెదేపా చేతిలో కీలుబొమ్మగా మారిందని ఆక్షేపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీడబ్ల్యూసీ మీటింగ్‌కు వెళ్లటం లేదంటూనే.. ఏపీ డిమాండ్లకు సంతకం చేసి వస్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన సీడబ్ల్యూసీ మీటింగ్ అజెండా మొదటి అంశం... పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు. అజెండాలో నల్లమల సాగర్ లేకపోతేనే మీటింగ్‌కు వస్తామని చెప్పి, తర్వాత వెళ్లిపోయి తెలంగాణను మోసం చేశారు. రాష్ట్రాల మధ్య గోదావరి జలాల పంపిణీయే జరగలేదని సీడబ్ల్యూసీ సమావేశంలో జీఆర్ఎంబీ చెప్పింది. జలాల పంపిణీ జరగలేదని జీఆర్ఎంబీ ఎలా చెబుతుంది? గోదావరిలో నీటి కేటాయింపులు జరగకపోతే.. ప్రాజెక్టులకు అనుమతి ఎలా ఇస్తున్నారని అన్నారు. గోదావరి బేసిన్‌లో వివిధ రాష్ట్రాలు చేపట్టిన 76 ప్రాజెక్టులకు అనుమతి ఎలా ఇచ్చారు? సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతోందని హరీశ్‌రావు విమర్శించారు.

# హామీలపై స్పష్టత ఏదీ

## ఉద్యోగుల బకాయిలపై ప్రస్తావన లేదే

## గవర్నర్ ప్రసంగంపై బీజేపీ పెదవి విరుపు



**హైదరాబాద్, మార్చి 16:** గవర్నర్ ప్రసంగంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఎలాంటి ప్రస్తావన లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రైతుల ఇబ్బందులు, ఉద్యోగాల భర్తీ గురించి లేదని, ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించలేదని తెలిపారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులు గోస పడుతున్నారని... ఎన్నేళ్లు అయినా వారికి బెనిఫిట్స్ అందడం లేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన చట్టాలు ఉన్నప్పటికీ వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. బీసీలను పూర్తిగా మోసం చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. సబ్ ప్లాన్ ముచ్చటే లేదన్నారు. ప్రభుత్వ అప్పులపై స్పష్టత లేదని తెలిపారు. గవర్నర్‌తో ప్రభుత్వం ఏదైనా మాట్లాడించేటప్పుడు ఆలోచించాలని.. అన్నీ అవాస్తవాలు, గందరగోళమైన మాటలు మాట్లాడించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రభుత్వం విస్మరించినంత మాత్రాన తాము విడిచిపెట్టమని... తెలంగాణ ప్రజల గొంతుకగా బీజేపీ నిలబడి పనిచేస్తుందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. సెంబ్లీలో తెలంగాణ గేయం తర్వాత వందేమాతరం గేయాన్ని ఆలపించకుండా ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని అవమానించారని మండిపడ్డారు. ఎంఐఎం ఎమ్మెల్యేల తీరు సిగ్గుచేటన్నారు. వందేమాతరం వినడానికి ఆసక్తి లేకనా? లేక దేశభక్తి లేకపోవడమా అని ప్రశ్నించారు. వందేమాతరం గేయాన్ని అవమానపరిచిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

# నందిని సిధారెడ్డికి 'కేంద్ర సాహిత్య అకాడమీ' అవార్డు

## 'అనిమేష' కవితా సంపుటికి దక్కిన గౌరవం..

## సాహితీవేత్తలు, కేసీఆర్, కేటీఆర్ హర్షం



**హైదరాబాద్, మార్చి 16:** ప్రముఖ తెలంగాణ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డికి 2025 సంవత్సరానికి గానూ ప్రతిష్ఠాత్మక 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు' లభించింది. ఆయన రచించిన 'అనిమేష' అనే కవితా సంపుటిని ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేశారు. కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సామాజిక, ఆర్థిక సంక్షోభాలను, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతను ఆయన ఈ సంపుటిలో అత్యంత హృద్యంగా చిత్రించారు. వలస కూలీల కష్టాలు, సమాజంలో నెలకొన్న ఒంటరితనం మరియు ఆందోళనలను అక్షరబద్ధం చేస్తూ ఆయన రాసిన కవిత్వం ఒక కాలానికి దర్పణంగా నిలిచిందని సాహితీవేత్తలు కొనియాడుతున్నారు. కేవలం అక్షరాల కూర్పుగా కాకుండా, సామాజిక కలతలను ప్రతిబింబించే ప్రేరణాత్మక రచనగా 'అనిమేష' నిలిచిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నందిని సిధారెడ్డి సాహితీ ప్రస్థానం తెలంగాణ ఉద్యమంతో విడదీయలేనిది. మెదక్ జిల్లా కేంద్రంగా ఆయన స్థాపించిన 'మంజీరా రచయితల సంఘం' తెలుగు సాహిత్యంలో ఒక నూతన వాణిని వినిపించడమే కాకుండా, ఎందరో వర్ధమాన కవులకు వేదికైంది. 'నాగేటి సాల్లల్ల నా తెలంగాణ' వంటి పాటల ద్వారా తెలంగాణ పల్లె జీవనాన్ని, అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఆయన, మలిదశ ఉద్యమంలో తన పాటలు మరియు కవిత్వంతో ప్రజలను చైతన్యపరచడంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ కవిగా ఆయన రచనలు రాష్ట్ర సాధన ఆకాంక్షను బలోపేతం చేయడమే కాక, ప్రజల సమస్యలకు గొంతుకగా నిలిచాయి. రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి, ప్రాచీన మరియు ఆధునిక సాహిత్య వికాసానికి ఆయన విశేష కృషి చేశారు. సిధారెడ్డికి ఈ గౌరవం దక్కడం పట్ల రాజకీయ, సాహితీ రంగాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనను అభినందిస్తూ, తెలంగాణ మట్టి వాసన తెలిసిన కవికి ఈ గౌరవం దక్కడం గర్వకారణమని పేర్కొన్నారు. కరోనా కాలంలోని మానవ వేదనను అద్భుతంగా చిత్రించిన 'అనిమేష'కు ఈ గుర్తింపు రావడం సముచితమని ఆయన కొనియాడారు. అదేవిధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ, సిధారెడ్డి తన శక్తివంతమైన కలం ద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటారని, ఆయన సాహిత్య ప్రస్థానానికి దక్కిన గొప్ప గౌరవం ఇదని అభివర్ణించారు. తెలుగు సాహితీ రంగానికి ఆయన చేసిన విశిష్ట సేవలు మరువలేనివని, ఈ పురస్కారం యావత్ తెలంగాణకు దక్కిన గౌరవమని అభినందనలు తెలిపారు.

# క్యూర్ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు

- అర్హులకే ఇళ్లు, అక్రమార్కులకు చెక్
- నివాసంలో లేని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు నోటీసులు
- ఏప్రిల్ 30వరకు గడువు
- అనర్హుల స్థానంలో అర్హులకు కేటాయిస్తాం
- క్యూర్ పరిధిలో హౌసింగ్‌పై మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నంతో మంత్రి పొంగులేటి సమీక్ష



**హైదరాబాద్, మార్చి 16:** హైదరాబాద్,రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని దీనికి తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూం ఇళ్ల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు, అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లకు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ఉండాలని ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు తలొగ్గవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు పొంది వాటిలో నివసించకుండా అ÷-దదెకు ఇస్తున్నవారికి, ఏళ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉంచుతున్నవారికి నోటీసులు జారీ చేయాలని , నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, ఎంతమంది స్పందించారు అక్కడ నివాసం ఉండకపోవడానికి వారు చెప్పిన కారణాలపై ఆరా తీశారు. 2 బిహెచ్‌కే, జెఎన్ ఆర్.ఎమ్ తదితర పథకాల్లో ఇళ్లు పొంది నివాసం ఉండని ఇళ్లను మే 1వ తేదీ నుంచి పరిశీలించాలని అటువంటి వారికి నోటీసులు ఇచ్చి, స్పందించని పక్షంలో కేటాయింపులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. నోటీసులపై స్పందించిన లబ్ధిదారుల నుంచి బాండు పేపరుపై తాము ఇక్కడే నివాసం ఉంటామని లేదంటే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ వారి నుంచి హామీ పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోగల కాలనీల్లో ముఖ్యంగా విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులను తప్పని సరిగా కల్పించాలని, ఈ విషయంలో జిహెచ్ ఎంసీ సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 22వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం టవర్లు మొత్తం పూర్తయ్యేవరకూ ఆగకుండా పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు కేటాయించాలన్నారు. అదేవిధంగా వివిధ కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను అ÷-దదె ప్రాతిపదకన గాకుండా వేలం పద్ధతిలో వాటిని విక్రయించాలని ఆ విధంగా వచ్చిన డబ్బును అక్కడి సొసైటీ, ప్రభుత్వం పేరిట జాయింట్ అకౌంట్ పేరిట వేయాలన్నారు. అంతేగాక ప్రజా ప్రయోజన కార్యాలయాల కోసం కూడా కొన్నింటిని కేటాయించాలని తెలిపారు. ఈ విషయంలో సహకార శాఖ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ, వీపీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి

## రైతులతో కలసి కలెక్టరేట్ వద్ద ధర్నా



**జగిత్యాల, మార్చి 16:** అన్నదాతల సమస్యలను పట్టించుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంట కొనుగోళ్లలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆగ్రహించారు. రైతుల పంటకు తగిన ధర దక్కకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మొక్కజొన్నను మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల పట్టణంలో రైతులు సోమవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జీవన్‌రెడ్డి నాయకత్వం వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మొక్కజొన్న రైతులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలపడానికి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. రైతుల చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ తమ ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. మొక్కజొన్న పంటకు తగిన ధర ఇవ్వాలని, వెంటనే ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతులు పంట పండించి మార్కెట్‌కు తీసుకువస్తే ప్రభుత్వం సరైన విధంగా కొనుగోళ్లు చేయడం లేదన్ని ÷ర్ అయ్యారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు మధ్యవర్తుల చేతిలో నష్టపోతున్నారని పేర్కొన్నారు. మార్కెట్లో ధరలు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల నుంచి మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో మంచి వ్యవస్థ ఉండేదని జీవన్‌రెడ్డి ప్రస్తావించారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేసేవారని గుర్తుచేశారు. అలాగే గత పదేళ్లలో కూడా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరిగినట్లు తెలిపారు. అయితే కాంగ్రెస్ సర్కార్‌లో ప్రస్తుతం ఆ విధానం సరిగా అమలు కావట్లేదని విమర్శించారు. ప్రభుత్వం మళ్లీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు జరుగుతుందని జీవన్‌రెడ్డి తెలిపారు. అయితే ఈసారి పంటకు సరైన ధర లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పంటను పండించడానికి రైతులు ఎరువులు, విత్తనాలు, నీటి ఖర్చుల కోసం అప్పులు చేసి సాగు చేస్తారని, కానీ మార్కెట్లో ధరలు తక్కువగా ఉండటంతో వారికి పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు తమ పంటను నిల్వ చేయలేక తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. పండించిన పంటకు కనీస ధర లభించకపోతే రైతన్నలు ఆర్థికంగా కుంగిపోతారని తెలిపారు. అన్నదాతల పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతన్నల నుంచి నేరుగా మొక్కజొన్న కొనాలని ప్రభుత్వాన్ని జీవన్ రెడ్డి కోరారు-

# ప్రాణాలు తీసిన చేపల వేట

## మూసీలో మునిగి ముగ్గురు యువకులు మృతి

**హైదరాబాద్, మార్చి 16:** చేపల వేటకు వెళ్లి.. ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటన గండిపేట జలాశయం దిగువన ఉన్న మూసి నది పరివాహక ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు, రెస్క్యూ టీం నదిలో గాలించి వారి మృతదేహాలను సోమవారం ఉదయం ఒడ్డుకు తీసుకువచ్చారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని ఇబ్రహీంబాగ్‌కు చెందిన కార్తీక్ (25), గోవర్ధన్ (23), వెంకటేష్ (25)లు ఆదివారం మూసి నది పరివాహక ప్రాంతంలో చేపల వేటకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండడంతో.. వారు నదిలో మునిగిపోయారు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అలాగే రెస్క్యూ టీమ్‌ను సైతం అక్కడికి రప్పించారు. సాయంత్రం నుంచి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ముగ్గురు ఒకే కాలనీ వాసులు కావడంతోపాటు స్నేహితులని మృతుల బంధువులు తెలిపారు. మృతుల కుటుంబాలు గాంధీ ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరు అవుతున్నారు.



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | మంగళవారం 17 మార్చి 2026



సంపాదకీయం

# మరికొన్నాళ్లు గ్యాస్ సంక్షోభం

దేశంలో గ్యాస్ కోసం ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. కమర్షిల్ గ్యాస్ అస్సలు లభించడం లేదు. దీంతో హోట్ పరిశ్రమ కుదేలయ్యింది. దేశవ్యాప్తంగా హోటళ్లు మూతపడ్డాయి. కార్మికులు రోడ్డున పడ్డారు. తిరిగి క ట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్నారు. తీవ్ర కాలుష్యంతో ఢిల్లీలో కట్లె పొయ్యిలను అనుమతించని ప్రభుత్వం తిరిగి అక్కడ కట్టెల పొయ్యిలకు అనుమతించింది. దీంతో గ్యాస్ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవచ్చు. దీనికి ఎవరిని నిందించి కూడా ప్రయోజనం లేదు. ఉన్న గ్యాస్‌ను సరఫరా చేస్తున్నారు. పానిక్ బుకింగ్స్ వల్ల చాలామందికి ఇబ్బంది ఎదురవుతోంది. అలాగే సిలిండర్లను బ్లాక్‌లో అమ్ముకుం టున్నారు. దీనికి ముందుగా చెక్ పెట్టాలి. గ్యాస్ సరఫరాలపై విజిలెన్స్ నిఘా పెట్టాలి. నల్లబజారుకు తరలకుండా చూడాలి. అలాగే హోటల్ పరిశ్రమను ఆదుకునే ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. ఈ క్రమంలో రెండు ఇంధన నౌకలు హర్మ్యాజ్ జలసంధి దాటి భారత్ చేరుకున్నాయి. ఇది కొంత ఊరటనిచ్చే అంశం. పర్షియన్ గల్ఫ్ నుంచి బయటకు వెళ్లే ఏకైక సముద్ర మార్గమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. జలసంధి నిండా వందలాది ట్యాంకర్లు నిలిచిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ చమురు ధర యుద్ధానికి ముందు బ్యారెల్‌కు 65 అమెరికన్ డాలర్లుగా ఉండగా, ఇప్పుడది వంద డాలర్లకు పెరిగింది. ఇదే పరిస్థితులు కొనసాగితే రానున్న రోజుల్లో ధర మరింతగా పెరగడం ఖాయమన్న విశ్లేషణలు వస్తున్నాయి. ఇరాన్‌కు సమీపంలోని 33 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో దాదాపు ఐదవ వంతు సాగుతుంది. మన దేశం రోజుకు సగటున 40 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకుంటూ ఉండగా, అందులో 55 శాతం దీని ద్వారానే వస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడితో మన దేశానికి తీవ్రమైన ఇంధన సంక్షోభం తప్పదన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటూ ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమ ఆసియా అంతా యుద్ధ మేఘాలు విస్తరిస్తున్నాయి. అమెరికా ఇరాన్‌పై చేసిన దాడి 16వ రోజుకు చేరుకుంది. ప్రతి బ్యారెల్ చమురు ధరలో ఒక డాలర్ పెరుగుదల చోటుచేసుకున్నా, భారత్‌పై సంవత్సరానికి 200 కోట్ల రూపాయల అదనపు దిగుమతి భారం పడుతుందని అంచనా! అధికారిక సమాచారం ప్రకారం 2024-25లో చమురు దిగుమతుల కోసం మన దేశం సుమారుగా 11.5 లక్షల కోట్ల రూపాయల (137 బిలియన్ డాలర్ల)ను ఖర్చు చేసింది. ఏకపక్షంగా యుద్ధానికి కాలుదువ్విన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'ప్రస్తుతం నాలుగు నుండి ఐదు వారాలు' కొనసాగవచ్చని చెబుతున్నారు. ఇరాన్ ప్రతిఘటన తీరును గమనిస్తున్న పరిశీలకులు యుద్ధం అంతకన్నా ఎక్కువ రోజులే సాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా పెరిగే దిగుమతి ఖర్చుల వల్ల విదేశీ లోటు పెరిగి వాణిజ్య సమతుల్యతను దెబ్బతీస్తుందని, రూపాయిపై ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి దేశీయ ట్రేడ్ సూచికలు పతనోన్ముఖానే వున్నాయి. మరోవైపు మన దేశం వద్ద ఉన్న చమురు నిల్వలు మరో 40-45 రోజుల వినియోగానికి మాత్రమే సరిపోతాయంటూ వస్తున్న వార్తలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మనకు పొరుగునే ఉన్న చైనా వద్ద దాదాపు ఆరునెలలకు సరిపడే నిల్వలు ఉండటం అక్కడి పాలకుల ముందు చూపునకు నిదర్శనం. రష్యా నుండి దిగుమతులుతగ్గాయి. ఇప్పుడు ఇరాన్‌పై అమెరికా చేసిన దాడి, హోర్ముజ్ జలసంధి మూసివేతతో మన దేశ ఇంధన భద్రత ప్రశ్నార్థకంగా మారినప్పటికీ ఇరాన్ భారత్ పట్ల అనుకూలత ప్రదర్శించింది. 40 రోజులకు సరిపడే నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ యుద్ధ తీవ్రత కొనసాగితే పెట్రో ధరలు పెరగక తప్పవన్న ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే దాని ప్రభావంతో నిత్యావసర వస్తువులతో పాటు, అన్ని రకాల వినియోగ సరుకుల మీద ఉంటుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే జరిగితే, దేశ వ్యాప్తంగా సామాన్యుల కష్టాలు మరింత పెరగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంధన సంక్షోభాలను ఎదుర్కొనేందుకు చమురు సరఫరా వనరులను విస్తరించేందుకు కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా హోటల్ పరిశ్రమలను ఆదుకోవాల్సి ఉంది. అయితే పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా దేశంలో వంటగ్యాస్‌కు డిమాండ్ అమాంతం పెరిగిందని కేందప్రభుత్వం అంగీకరించింది. అయినప్పటికీ వంట గ్యాస్ పంపిణీలో ఇబ్బంది లేదని భరోసా ఇచ్చింది. దేశీయంగా వంట గ్యాస్ ఉత్పత్తి 30శాతం మేర పెంచినట్లు తెలిపింది. వాణిజ్య సిలిండర్ల కొరత ఉండడంతో హోటళ్లు, ఆహార పరిశ్రమ ఇబ్బందులు పడుతోందని అంగీకరించారు. అందువల్ల వాణిజ్య సిలిండర్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించామని చెప్పారు. ప్రాధాన్య క్రమంలో అవి పంపిణీ చేస్తాయని తెలిపారు. ఆస్పత్రులు, విద్యా సంస్థలకు వంట గ్యాస్‌ను అందజేస్తామని ప్రకటించారు. ఇక, ఇళ్లకు పైపుల ద్వారా సరఫరా అయ్యే పైప్డ్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్‌జీ), వాహనాలకు వినియోగించే కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్ (సీఎన్‌జీ)ల సరఫరాకు ఎలాంటి అంతరాయాలు లేవని తెలిపింది. పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న వారికి గ్యాస్ సిలిండర్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తంగా ఈ సంక్షోభం ఇంకెంతకాలం అన్నది యుద్ధ తీవ్రతను బట్టి మాత్రమే మారుతుందన్నది నిజం.

# ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

**దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడి**
**ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు**

**టెహ్రాన్, ఫిబ్రవరి 16:** ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. డ్రోన్ దాడుల ను తీవ్రతరం చేసింది. తన పొరుగుదేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ దాడులు చేసింది. ఈ సందర్భంగా ఒక డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దాంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్టు సిబ్బందికి సేఫ్టీ నోటీస్ జారీచేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచనచేశారు. అంతేగాక పలు విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంధన ట్యాంక్‌పై దాడి నేపథ్యంలో ఈ ప్రాంతంలోని కీలకమైన ఇతర మౌలిక సదుపాయాల వద్ద భద్రత పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు.



# ముంద్రా పోర్టుకు చేరుకున్న శివాలిక్

- ఖతార్ నుంచి గ్యాస్‌తో వచ్చిన నౌక
- భారత్‌కు దక్కనున్న భారీ ఊరట




**ముంద్రా, ఫిబ్రవరి 16:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. శివాలిక్ ఎల్‌పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్‌పీజీని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్-లోడింగ్ పక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకుపోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణాన్ని నిలిపివేయగా, భారత్ మాత్రం తన వ్యూహాత్మక సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగిస్తోంది.

# హర్మ్యాజ్ జలసంధి వద్దకు యుద్ధనౌకలు

- ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించిన ఆస్ట్రేలియా
- సంయమనం పాటించాలన్న జపాన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను మిత్ర దేశాలు తిరస్కరించాయి. ప్రస్తుతానికి తమకు ఆ ఆలోచన లేదని తేల్చి చెప్పాయి. ట్రంప్ అభ్యర్థనను ఆస్ట్రేలియా తోసి పుచ్చింది. తాము యుద్ధ నౌకలను పంపబోమని స్పష్టం చేసింది. 'ఆ జలసంధి ఎంత కీలకమో మాకు తెలుసు. కానీ అక్కడకు మేము యుద్ధ నౌకలను పంపబోము. అసలు యుద్ధ నౌకల కోసం మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు' అని ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ చెప్పారు. ట్రంప్ అభ్యర్థనపై జపాన్ ఆచితూచి స్పందించింది. ఈ విషయంలో సంయమనం అవసరమని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము మేరిటైమ్ చర్యల గురించి ఆలోచించట్లేదని పేర్కొంది. ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్టు తెలిపింది. అమెరికాతో మరిన్ని చర్చల తరువాత ఈ విషయంలో ఒక నిర్ణయానికి వస్తామని దక్షిణ కొరియా పేర్కొంది. సమగ్ర సమీక్ష తరువాత ఈ విషయంలో ముందడుగు వేస్తామని వెల్లడించింది. బ్రిటన్ కూడా ఈ విషయమై ఆచితూచి స్పందించింది. యుద్ధ నౌకలను పంపించే విషయంలో ట్రంప్‌తో చర్చిస్తున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో కూడా చర్చించినట్టు తెలిపారు. సోమవారం జరగనున్న సమావేశంలో మరోసారి ఈ విషయమై చర్చిస్తామని అన్నారు.హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపించాలని పలు దేశాలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం అభ్యర్థించిన విషయం తెలిసిందే. తమ పరిధిలోని ప్రాంతాన్ని ఆయా దేశాలు రక్షించుకోవాలని అన్నారు. ఇంధన అవసరాల కోసం హోర్ముజ్ జలసంధిపై అమెరికా అంతగా ఆధారపడలేదని అన్నారు. ఇతర దేశాలకే ఆ అవసరం ఎక్కువని కామెంట్ చేశారు. ఈ సందర్భంగా చైనా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. చైనా దిగుమతుల్లో అధిక శాతం హోర్ముజ్ మీదుగానే వెళుతున్నాయని అన్నారు. అయితే, హోర్ముజ్ జలసంధిని తెరిపించే ప్రయత్నాల్లో చైనా భాగం అవుతుందా? లేదా? అనే విషయంపై ఆయన స్పందించేందుకు నిరాకరించారు.



# గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

**తైవాన్ దిశగా యుద్ధనౌకలు, విమానాల మొహరింపు**

**తైపీ, ఫిబ్రవరి 16:** గల్ఫ్ యుద్ధంతో అంతా అటువైపు దృష్టి పెట్టగా చైనా మరోమారు తైవాన్‌పై దృష్టి సారించింది. గత రెండు వారాలుగా కొంత నిశ్శబ్దంగా ఉన్న చైనా సైన్యం.. మళ్ళీ తైవాన్ సరిహద్దుల్లో తన ప్రాబల్యాన్ని చాటుకోవడం మొదలుపెట్టింది. తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత 24 గంటల్లో భారీ సంఖ్యలో , నౌకలు చైనా యుద్ధ విమానాలు తైవాన్ గగనతలంలోకి ప్రవేశించాయి. కాగా, ఫిబ్రవరి 27 నుండి మార్చి 13 వరకు తైవాన్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధ విమానాల రాక గణనీయంగా తగ్గింది. సాధారణంగా ప్రతిరోజూ పదుల సంఖ్యలో విమానాలను పంపే చైనా, ఈ 16 రోజుల కాలంలో కేవలం 7 విమానాలను మాత్రమే పంపింది. అయితే, ఈ ఆకస్మిక విరామానికి కారణమేంటో రక్షణ నిపుణులకు సైతం అంతుచిక్కలేదు. కానీ, ఆదివారంనుండి చైనా మళ్ళీ తన దూకుడును పెంచింది. తైవాన్ చుట్టూ సుమారు 26 చైనా సైనిక విమానాలను గుర్తించారు. వీటిలో 16 విమానాలు తైవాన్ నైరుతి ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్ లోకి ప్రవేశించాయి. విమానాలతో పాటు 7 చైనా యుద్ధ నౌకలు కూడా తైవాన్ సముద్ర తీరానికి సమీపంలో చక్కర్లు కొడుతున్నాయి. ఫిబ్రవరి 25న 30 విమానాలు వచ్చిన తర్వాత, మళ్ళీ ఈ స్థాయి-ంలో విమానాలు రావడం ఇదే తొలిసారి. ఇలాఉండగా, మార్చి 31న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఇక, చైనా విమానాలు లేని సమయంలో కూడా వారి యుద్ధ నౌకలు సముద్రంలోనే ఉన్నాయని తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ స్పష్టం చేశారు. చైనా నుండి ముప్పు ఏమాత్రం తగ్గలేదని.. తాము నిరంతరం అప్రమత్తంగానే ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

# దుబాయ్ విమానాల రద్దు

**ఢిల్లీ:** సోమవారం తెల్లవారుజామున దుబాయ్ ఎయిర్ పోర్టు సమీపంలో ఇంధన ట్యాంక్‌పై డ్రోన్ దాడి జరిగింది. విమానాశ్రయ పరిసర ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఎయిర్ పోర్టును మూసివేస్తున్నట్లు దుబాయ్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. దుబాయ్ వెళ్లే విమానాలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయి-ంతే, అబుదాబి, రస్ అల్‌ఖైమా, షార్జాలకు విమానాలు యథావిధిగా కొనసాగుతాయని ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు తిరువనంతపురం నుంచి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ విమానం కూడా ఆగింది. టీఆర్వీ--డీఎక్స్‌బీవిమానం353 మంది ప్రయాణికులు, 19 మంది సిబ్బందితో ఇవాళ ఉదయం 4:40 గంటలకు బయలుదేరి.. దుబాయ్ ఎయిర్ పోర్టు మూసివేయడంతో ఉదయం 8:40 గంటలకు తిరిగి వచ్చింది. అలానే కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరిన మరో ఎమిరేట్స్ విమానం ఈకే533 కూడా వెనక్కి వచ్చేసింది.

# అన్ని రాష్ట్రాల్లోనూ గ్యాస్ నిల్వలు ఉన్నాయి

**వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన**

**న్యూఢిల్లీ, మార్చి 16:** వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సరఫరా చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉందని తెలిపింది. హర్మ్యాజ్ దగ్గర భారత నౌకలన్నీ క్షేమంగానే ఉన్నాయని, శివాలిక్ నౌకలో 48 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉందని కేంద్రం వెల్లడించింది. కాగా, ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన 'శివాలిక్' నౌక సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపి వేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు మెల్లమెల్లగా మూతపడుతున్నాయి. హాస్టల్స్ మెనూను పూర్తిగా మార్చేశాయి. కేవలం ఒక కర్రీతో సరిపెడుతున్నాయి. గ్యాస్ కొరత కారణంగా పలు దేవాలయాలు తాత్కాలికంగా ప్రసాదం తయారీని నిలిపివేశాయి. సీఎన్‌జీ బంకుల్లోనూ గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయి. దీని కారణంగా గ్యాస్‌తో నడిచే వందలాది ఆటోలు నిలిచిపోతున్నాయి. డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగదారులకు కూడా కష్టాలు తప్పటం లేదు. బుకింగ్, డెలివరీ విషయంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. యుద్ధ



పరిస్థితులకు తోడు.. పండుగ సమయం కావటంతో గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి సిలిండర్ తీసుకుంటున్నారు.

# పవిత్ర గ్రంథం ఖురాన్

## శతాబ్దాల చరిత్రను మోసుకొచ్చిన ఆధ్యాత్మిక మార్గదర్శి

"మానవజాతికి నైతిక విలువలు, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందించే పవిత్ర గ్రంథం ఖురాన్.! శతాబ్దాల చరిత్రను దాటుకుంటూ ప్రపంచంలోని అనేక దేశాలలో అరుదైన ఖురాన్ ప్రతులు, సూక్ష్మ పరిమాణంలోని ఖురాన్ గ్రంథాలు, భారీ పరిమాణంలో తయారైన ఖురాన్ పుస్తకాలు సంరక్షించబడుతున్నాయి. ముఖ్యంగా రంజాన్ మాసంలో మసీదులు, ఇళ్లలో పిల్లలు, మహిళలు, వృద్ధులు కలిసి ఖురాన్ పఠనం చేయడం ద్వారా విశ్వాసం మరింత బలపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఖురాన్‌కు సంబంధించిన అనేక విశేషాలు ఈ పవిత్ర గ్రంథానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి.!"

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)





- ప్రపంచంలో అతి ప్రాచీన ఖురాన్ ప్రతులు
- 'మక్కా'లో ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్
- సూక్ష్మ పరిమాణంలో అతి చిన్న ఖురాన్
- ఖురాన్ ఆకారంలో నిర్మితమైన మ్యూజియాలు, విశేషాలు
- రంజాన్ మాసంలో మరీ ప్రత్యేకం.. సామూహిక పఠనం కూడా









### ప్రపంచంలోని అతి ప్రాచీన ఖురాన్ ప్రతులు

ఖురాన్ చరిత్రలో అత్యంత పురాతనంగా గుర్తించబడిన ప్రతుల్లో ఒకటి 'సమర్‌కండ్' ఖురాన్. ప్రస్తుతం ఇది ఉజ్బెకిస్తాన్ దేశంలోని తాష్కెంట్ నగరంలోని హస్త్ ఇమామ్ గ్రంథాలయంలో సంరక్షించబడుతోంది. ఈ ప్రతిని 7వ శతాబ్దం కాలానికి చెందినదిగా భావిస్తున్నారు. ఈ గ్రంథం ఖలీఫా ఉస్మాన్ కాలంలో తయారైన ఖురాన్ ప్రతులలో ఒకటిగా సంప్రదాయం చెబుతుంది.అదేవిధంగా ఇరాన్‌లోని మష్హాద్ గ్రంథాలయంలో కూడా ప్రాచీన ఖురాన్ ప్రతులు ఉన్నాయి. వీటి కొన్ని భాగాలు మొదటి ఇస్లామిక్ శతాబ్దానికి చెందినవిగా పండితులు భావిస్తున్నారు.ఈ పురాతన ప్రతులు ఇస్లామిక్ చరిత్ర, అరబిక్ కాలిగ్రఫీ కళ, గ్రంథ సంరక్షణ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి.



### ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్

సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో హిరా కల్చరల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఖురాన్ మ్యూజియంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్ ప్రదర్శించబడుతోంది. ఈ భారీ గ్రంథం సుమారు 312 సెం.మీ ఐ 220 సెం.మీ పరిమాణంలో, సుమారు 700 పేజీలతో రూపొందించబడింది. ఈ గ్రంథాన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్‌గా గుర్తించింది.ఈ ఖురాన్ అరబిక్ కాలిగ్రఫీ, అలంకరణ కళ, బంగారు అలంకరణలతో రూపొందించబడిన అరుదైన కళాఖండంగా కూడా గుర్తింపు పొందింది.



### అతి చిన్న ఖురాన్ - సూక్ష్మ అద్భుతం

ప్రపంచంలో అత్యంత చిన్న పరిమాణంలో ఉన్న ఖురాన్ ప్రతులు కూడా ఉన్నాయి. జోర్డాన్‌లోని ఒక మ్యూజియంలో ప్రదర్శిస్తున్న ఖురాన్ సుమారు 2.5 సెం.మీ పొడవు, 1.5 సెం.మీ వెడల్పు మాత్రమే ఉంటుంది. ఈ చిన్న గ్రంథాన్ని చదవడానికి ప్రత్యేకంగా పెద్ద కంటకన్నం అవసరం అవుతుంది. అజర్బైజాన్‌లోని గంజా నగరంలోని మినియేచర్ బుక్ మ్యూజియంలో కూడా సుమారు 2 ఐ 3 సెం.మీ పరిమాణంలో ఖురాన్ ప్రతిని సంరక్షిస్తున్నారు. ఇవి ఖురాన్ పట్ల భక్తి ఎంతటి స్థాయిలో ఉందో తెలియజేసే అద్భుత కళాఖండాలు.

### ఖురాన్ గ్రంథ నిర్మాణ వైశిష్ట్యం

ఖురాన్ గ్రంథం మొత్తం 114 'సూరాలు'..వేలాది 'ఆయతు'లతో రూపొందింది. ఇందులో మానవ జీవన విధానం, నైతిక విలువలు, దయ, సత్యం, న్యాయం వంటి అంశాలు వివరించబడతాయి. అందుకే ఖురాన్‌ను ముస్లింలు కేవలం మత గ్రంథంగా కాకుండా జీవన మార్గదర్శిగా భావిస్తారు.!

### ఖురాన్ ఆకారంలో నిర్మితమైన భవనాలు

ప్రపంచంలోని కొన్ని దేశాలలో ఖురాన్‌ను ప్రతిబింబించే విధంగా మ్యూజియాలు, సాంస్కృతిక కేంద్రాలు నిర్మించబడ్డాయి. మలేషియాలోని మలక్కా నగరంలో ఉన్న అల్-ఖురాన్ మ్యూజియం ఖురాన్ చరిత్ర, అరుదైన ప్రతులు, కళా సంపదలను ప్రదర్శించే ప్రత్యేక కేంద్రంగా నిలుస్తోంది.ఈ మ్యూజియాల్లో ఖురాన్ ప్రతుల అభివృద్ధి, ఇస్లామిక్ కాలిగ్రఫీ, ప్రపంచవ్యాప్తంగా ఖురాన్ వ్యాప్తి గురించి ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

### రంజాన్ మాసంలో ఖురాన్ పఠనం

ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఖురాన్ పఠనానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలో మసీదుల్లో 'తరావీహ్' నమాజ్ సందర్భంగా ఖురాన్ సంపూర్ణ పఠనం నిర్వహిస్తారు. కుటుంబాల్లో పిల్లలు, మహిళలు, వృద్ధులు కలిసి సామూహికంగా ఖురాన్ చదవడం ఒక ఆధ్యాత్మిక సంప్రదాయంగా కొనసాగుతోంది.





### జీవిత చరమాంకంలో ఖురాన్ పఠనం

ముస్లింలలో జీవిత చివరి దశలో కూడా ఖురాన్ పఠనం చేయడం విశ్వాసానికి సంకేతంగా భావిస్తారు. ఖురాన్ వచనాలు మనసుకు శాంతిని అందిస్తాయని, ఆధ్యాత్మిక ధైర్యాన్ని ఇస్తాయని విశ్వాసం ఉంది.

### ఆధ్యాత్మిక విలువల నిధి.!

ప్రాచీన ప్రతుల నుండి సూక్ష్మ గ్రంథాల వరకూ, భారీ ఖురాన్ పుస్తకాల నుండి మ్యూజియాల వరకూ..ప్రపంచవ్యాప్తంగా ఖురాన్‌కు లభిస్తున్న గౌరవం అపారమైనది. కాలం మారినా, తరాలు మారినా ఖురాన్ సందేశం మానవాళికి నైతికత, శాంతి, సత్యం దిశగా మార్గం చూపుతూ కొనసాగుతూనే ఉంది.మొత్తంగా చూస్తే ఖురాన్ కేవలం ఒక మత గ్రంథమే కాదు..అది మానవ సమాజానికి నైతికత, కరుణ, ధర్మం, సహనం వంటి విలువలను బోధించే ఆధ్యాత్మిక మార్గదర్శి. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ పవిత్ర గ్రంథ సంప్రదాయం నేటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది విశ్వాసుల జీవితాలను ప్రభావితం చేస్తూనే ఉంది.






# మాల ధరించిన విద్యార్థులకు నో ఎంట్రీ!

**'హనుమాన్ దీక్ష'లో ఉన్న విద్యార్థులను అడ్డుకున్న 'నిఖిల్ భరత్ కాన్వెంట్ హైస్కూల్' యాజమాన్యం**

## మాల తీసేసే టైం.. 21రోజులు సెలవు పత్రం రాయించుకుని.. విద్యార్థుల గెంటివేత

### పాఠశాలకు చేరుకున్న వందలాది మంది 'హనుమాన్ మాలధారులు'



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని 'నిఖిల్ భరత్ కాన్వెంట్ హైస్కూల్'లో హనుమాన్ మాలలో ఉన్న విద్యార్థులను సోమవారం తరగతులకు అనుమతించకపోవడం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఐదుగురు విద్యార్థులను అడ్డుకోవడంతో ఆగ్రహించిన హనుమాన్ మాలదారులు భారీగా స్కూల్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు.పరిస్థితి అదుపు తప్పి ఫర్నిచర్ ధ్వంసం వరకు వెళ్లింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సమన్వయం చేయడంతో చివరికి యాజమాన్యం విద్యార్థులను క్లాస్‌లోకి అనుమతించాల్సి వచ్చింది. ఇదే సమయంలో పాఠశాల వైఖరిపై ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోంది.

- నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య)

- యాజమాన్యాన్ని నిలదీసి.. ఫర్నీచర్ ధ్వంసం
- చేతులు దాటిన పరిస్థితి.. పోలీసుల రంగప్రవేశం
- హనుమాన్ మాలదారుల ఆందోళన.. ఫర్నిచర్ ధ్వంసం
- పాఠశాలలోనే దీక్షాధారుల బైఠాయింపు
- మెట్‌పల్లి పట్టణంలో ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో తలొగ్గిన స్కూల్ యాజమాన్యం
- 'వారికో న్యాయం.. మాకో న్యాయమా..?' అంటూ దీక్షాధారుల ఆగ్రహం

### విద్యార్థుల గెంటివేతతో మొదలైన ఉద్రిక్తత.!

మెట్‌పల్లి పట్టణంలోని 'నిఖిల్ భరత్ కాన్వెంట్ హైస్కూల్'లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు హనుమాన్ దీక్షలో భాగంగా మాల ధరించి సోమవారం పాఠశాలకు హాజరయ్యారు. అయితే యూనిఫామ్ మరియు పాఠశాల నిబంధనలను కారణంగా చూపుతూ యాజమాన్యం వారిని తరగతులకు అనుమతించలేదు. 21 రోజులపాటు దీక్షలో ఉన్నందున పాఠశాలకు రాకూడదని.. ఆమేరకు ఆ విద్యార్థులతో 'సెలవు పత్రం' రాయించుకున్నారు. 'చదువుకోవాలంటే మాల తీసేసి రండి.! దీక్షలోనే ఉండాలనుకుంటే ఇంటి వద్ద భజన చేసుకోమని'.. ఖరాఖండిగా చెప్పేసి స్కూల్ నుంచి గెంటేయడంతో వివాదాస్పదమైంది. అయితే..మాల ధరించిన విద్యార్థులను అడ్డుకోవడం సరైంది కాదని తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం విధ్వంసానికి దారితీసింది.!

### భారీగా చేరుకున్న మాలధారులు- ఆందోళన తీవ్రరూపం

విషయం తెలిసిన వెంటనే హనుమాన్ మాలధారులు, స్థానిక భక్తులు వందలాది సంఖ్యలో పాఠశాల వద్దకు చేరుకున్నారు. 'హనుమాన్ మాల వేసుకుంటే విద్యార్థులకు చదువు చెప్పరా?' అంటూ యాజమాన్యాన్ని నిలదీశారు. విద్యార్థులను పాఠశాలకు రానివ్వకుండా నిబంధనలు పెట్టడం సరైంది కాదని తల్లిదండ్రులు కూడా తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జైరాం..జై హనుమాన్' నినాదాలతో పాఠశాల పరిసర ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.

### ఫర్నిచర్ ధ్వంసం-ఉద్రిక్తత తారస్థాయికి

ఆందోళన క్రమంగా ఉద్రిక్తంగా మారి కొందరు మాలధారులు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన ఘటన చోటుచేసుకుంది. కొందరు సిబ్బందిపై దాడికి కూడా ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో పాఠశాలలో భయాందోళన వాతావరణం నెలకొంది. పరిస్థితి పూర్తిగా నియంత్రణలో లేకుండా పోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది.

### పోలీసుల రంగప్రవేశం..

సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ కిరణ్ కుమార్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. హనుమాన్ స్వాములు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యంతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. చివరకు విద్యార్థులను తిరిగి క్లాస్‌లోకి అనుమతించేందుకు యాజమాన్యం ఒప్పుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి కొంతవరకు సద్దుమణిగింది.

### రంజాన్ అంశం తెరపైకి.. ద్వంద్వ వైఖరి ఆరోపణలు!

ఈ ఘటనలో మరో కీలక అంశం చర్చనీయాంశమైంది. రంజాన్ మాసంలో ముస్లిం టీచర్లు, విద్యార్థులకు ప్రార్థనలు చేసుకునేందుకు పాఠశాల యాజమాన్యం వెసులుబాటు కల్పిస్తోందని, అయితే హనుమాన్ మాల ధరించిన విద్యార్థులను అనుమతించకపోవడం ద్వంద్వ వైఖరిగా ఉందని మాలదారులు ఆరోపించారు. 'వారికో న్యాయం.. మాకో న్యాయమా..?' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశం ఘటనకు మరింత ఉద్రిక్తతను మరింత పెంచింది.!

### పాఠశాలపై చర్యల డిమాండ్

ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తీవ్రంగా స్పందిస్తున్నారు. హిందూ భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపిస్తూ 'నిఖిల్ భరత్ కాన్వెంట్ హైస్కూల్' రిజిస్ట్రేషన్ రద్దు చేసి వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం జరిగిన ఘటనపై సోషల్ మీడియా వేదికగా కూడా పాఠశాల యాజమాన్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాల నిబంధనలు, విద్యార్థుల వ్యక్తిగత విశ్వాసాల మధ్య సమతుల్యత ఎలా ఉండాలన్న అంశంపై చర్చ మొదలైంది. విద్య హక్కు, ఆచారాలు..ఈ రెండింటి మధ్య సమన్వయం అవసరమని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### విచారణకు డిమాండ్.. భవిష్యత్‌పై ఆందోళన.!

ఈ ఘటనపై జగిత్యాల జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సంఘటనతో మెట్‌పల్లి పట్టణంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, ప్రస్తుతం పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటోంది.!!









# నేను మనిషినే..

## నేను కూడా తప్పులు చేసి ఉండొచ్చు..

### విరాట్, రోహిత్ వివాదంపై గంభీర్ వ్యాఖ్యలు

**ముంబై:** టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. స్టార్ ప్లేయర్స్ విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మకు ఎప్పుడూ పొసగదని.. వారి మధ్య ఏదో జరుగుతుందని పుకార్లు షికార్లు చేయగా.. కొన్ని సార్లు అది బహిర్గతం కూడా అయ్యింది.. అయితే, విరాట్, రోహిత్‌తో తన సంబంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు గంభీర్.. గత కొంతకాలంలో తాను కూడా కొన్ని తప్పులు చేసి ఉండవచ్చని ఆయన అంగీకరించారు. అంతేకాదు.. నేను మనిషినే.. నేను కూడా తప్పులు చేసి ఉండొచ్చు అని పేర్కొన్నారు..

**రెవ్‌స్పోర్ట్జ్ కాన్‌క్లేవ్‌లో గంభీర్ వ్యాఖ్యలు**

మార్చి 16న కోల్‌కతాలో జరిగిన RevSportz Conclaveలో మాట్లాడిన టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. ఆటగాళ్లతో వ్యవహరించే విషయంలో తీసుకున్న నిర్ణయాలు ఎల్లప్పుడూ మంచి ఉద్దేశ్యంతోనే తీసుకున్నానని తెలిపారు. "నేను కూడా మనిషినే. నేను తప్పులు చేయొచ్చు. ఆటగాళ్లకు కూడా తప్పులు చేసే హక్కు ఉంది. గత 18 నెలల్లో నేను కొన్ని తప్పులు చేసి ఉండవచ్చు. కానీ, నా ఉద్దేశాలు ఎప్పుడూ సరైనవే. మంచి ఉద్దేశ్యంతో తీసుకున్న తప్పుడు నిర్ణయాన్ని అంగీకరించవచ్చు. అయితే, చెడు ఉద్దేశ్యంతో తీసుకున్న నిర్ణయం మాత్రం డ్రెస్సింగ్ రూమ్‌లో ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు" అని గంభీర్ అన్నారు. అంతేకాదు.. డ్రెస్సింగ్ రూమ్ ముందు నిలబడి ఆటగాళ్ల కళ్లలోకి చూసి నిజాయితీగా మాట్లాడగలిగితేనే కోచ్‌గా తన బాధ్యతను సరిగ్గా నిర్వర్తిస్తున్నానని గంభీర్ పేర్కొన్నారు.

**కోహ్లీ, రోహిత్ రిటైర్మెంట్ తర్వాత మార్పులు**

గంభీర్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన కొన్ని నెలలకే విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఈ నిర్ణయం 2024-25లో జరిగిన.. Border-Gavaskar Trophyలో భారత జట్టు నిరాశపరిచిన ప్రదర్శన తర్వాత వచ్చింది. అలాగే న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో కూడా భారత్ ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో బీసీసీఐ జట్టు ప్రదర్శనను సమీక్షించి కొన్ని కొత్త మార్గదర్శకాలను అమలు చేసింది.

**యువ ఆటగాళ్లకు అవకాశాలు**

కోహ్లీ, రోహిత్ టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకున్న తర్వాత భారత టెస్ట్ జట్టులో మార్పుల దశ ప్రారంభమైంది. యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వగా, శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. గంభీర్, గిల్ నాయకత్వంలో భారత్ ఇంగ్లాండ్ పర్యటనలో టెస్ట్ సిరీస్‌ను డ్రా చేసుకుంది. అలాగే స్వదేశంలో వెస్టిండీస్‌పై విజయం సాధించింది. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో జట్టు పరాజయం చవిచూసింది. మరోవైపు.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. భారత జట్టుకు వన్డే ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతున్నారు. ఇద్దరూ ICC Cricket World Cup 2027పై దృష్టి సారించారు. అయితే, ప్రపంచకప్ జట్టులో వారి స్థానం ప్రదర్శన ఆధారంగానే నిర్ణయిస్తామని జట్టు మేనేజ్‌మెంట్, సెలెక్టర్లు స్పష్టం చేశారు.

# పాక్ క్రికెట్‌లో సంక్షోభం

## అల్లుడిని టార్గెట్ చేసిన షాహీద్ అఫ్రిది.. • బంగ్లాదేశ్ చేతిలో పాక్ ఘోర పరాజయం..

**పాక్ సెలక్టర్లు, అల్లుడిపై షాహిద్ అఫ్రిది విమర్శలు**






**ఢిల్లీ:** ఇటీవల టీ20 వరల్డ్ కప్‌లో ఘోర పరాజయాలు మరవకముందే, పాకిస్తాన్ జట్టు బంగ్లాదేశ్ చేతిలో దారుణంగా ఓడిపోయింది. బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను 2-1 తేడా పాకిస్తాన్ పరాజయాలను చవిచూసింది. దీంతో పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు ఆటగాళ్లు, సెలక్షన్ కమిటీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. పాక్ మాజీ స్టార్ షాహీద్ అఫ్రిది, తన అల్లుడు అని చూడకుండా షాహీన్ అఫ్రిదిపై విమర్శలు గుప్పించారు. ఆదివారం జరిగిన మూడో వన్డేలో సల్మాన్ అలీ ఆఘా నేతృత్వంలోని పాక్ టీమ్ ఓడిపోయింది. ఓటమి తర్వాత షాహీద్ అఫ్రిది ఒక వీడియోలో మాట్లాడుతూ.. బాబర్ అజమ్‌ను జట్టు నుంచి తప్పించడంతో పాటు తన అల్లుడు షహీన్ అఫ్రిదికి కెప్టెన్సీ అప్పగించాలనే నిర్ణయాన్ని ప్రశ్నించారు. పాక్ జట్టులో సర్జరీల పేరుతో నాశనం చేస్తున్నారని పీసీబీ సెలెక్టర్లపై షాహిద్ అఫ్రిది మండిపడ్డారు. "మీరు 2026 ా20 ప్రపంచ కప్‌లో ప్రదర్శనలను చూశారు, ఆ తర్వాత మేము బంగ్లాదేశ్ సిరీస్‌ను కూడా 2--1తో కోల్పోయాము. నా అభిప్రాయం ప్రకారం, సెలక్షన్ కమిటీ విమర్శలకు అర్హమైనది. కమిటీలోని మీరందరూ చాలా క్రికెట్ ఆడారు, అయినప్పటికీ ఏ ఫార్మాట్‌కు ఎవరు కెప్టెన్‌గా ఉ ండాలో మీకు ఇంకా ఆలోచన ఉన్నట్లు లేదు" అని అఫ్రిది అన్నారు. "మీరు సర్జరీల పేరుతో చాలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. పాకిస్థాన్ దేశవాళీ క్రికెట్ ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి సరిపోవు, అలాంటి చోట రెండు మూడు మ్యాచ్‌లు ఆడిన వారికి నేరుగా పాకిస్థాన్ క్యాప్ ఇవ్వడం ఏంటి?" అని ప్రశ్నించారు. సీనియర్ ఆటగాళ్లు టీ20 వరల్డ్ కప్‌లో మంచి ప్రదర్శన చేయనప్పటికీ, వన్డేల్లో మంచి రికార్డులు కలిగి ఉన్నారని, అలాంటి వారిని పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాకిస్థాన్-బంగ్లాదేశ్ మ్యాచ్‌లో మరో వివాదం..

## వైడ్ బాల్‌కి రివ్యూ, ఐసీసీకి ఫిర్యాదు!




**ఢిల్లీ:** మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఢాకా వేదికగా ఆదివారం పాకిస్థాన్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన మూడో వన్డేలో వివాదం చోటుచేసుకుంది. మ్యాచ్ చివరి ఓవర్‌లో జరిగిన ఒక ఘటన ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంపైర్ తీసుకున్న నిర్ణయం, దానిపై బంగ్లాదేశ్ జట్టు తీసుకున్న రివ్యూ కారణంగా రెండు జట్ల మధ్య వివాదం తలెత్తింది. ఇప్పటికే ఈ సిరీస్‌లోని రెండో వన్డే మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ సల్మాన్ అలీ అఘా రనౌట్ తీవ్ర వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ విజయానికి చివరి ఓవర్‌లో 14 రన్స్ అవసరం అయ్యాయి. ఆ ఓవర్‌ను బంగ్లా స్పిన్నర్ రిషాద్ వేశాడు. తొలి రెండు బంతులకు రిషాద్ పరుగులు ఇవ్వలేదు. మూడో బంతికి రెండు రన్స్ వచ్చాయి. నాలుగో బంతికి పరుగేమీ రాలేదు. ఐదో బాల్‌ని రిషాద్ లెగ్ సాధించగా.. బంతిని షాహీన్ ఆఫ్రిది డౌన్ ది లెగ్ ఆడటానికి ప్రయత్నించాడు. షాట్ కనక్ట్ కాలేదు. దీంతో ఫీల్డ్ అంపైర్ వైడ్‌గా ప్రకటించాడు. వికెట్ కీపర్ లిట్టన్ దాస్ సూచన మేరకు బంగ్లా కెప్టెన్ రివ్యూ తీసుకున్నాడు. ఇక్కడే వివాదం చోటు చేసుకుంది. రివ్యూలో బంతి వైడ్ కాదని, సరైన బంతేనని థర్డ్ అంపైర్ తేల్చాడు. ఈ ఘటన తర్వాత పాకిస్థాన్ ప్లేయర్స్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బంగ్లా ఆటగాళ్లు మైదానంలోని బిగ్ స్క్రీన్‌పై రీప్లే చూసిన తర్వాతే.. రివ్యూకి వెళ్లారని పాక్ ఆరోపించింది. ఫీల్డ్ అంపైర్ నిర్ణయం అనంతరం 15 సెకన్లలోపే డీఆర్ఎస్ కోరాలని, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా రివ్యూకు అంపైర్ అనుమతించడంపై పాక్ అసహనం వ్యక్తం చేసింది. ఇది మ్యాచ్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. ఈ విషయంపై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వివాదంపై ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# గేల్ 175 రికార్డును బద్ధలు కొడతా

## వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ధీమా

**న్యూఢిల్లీ, మార్చి 16:** ఐపీఎల్ చరిత్రలో 'యూనివర్స్ బాస్' క్రిస్ గేల్ నెలకొల్పిన 175 పరుగుల భారీ స్కోరు రికార్డును బద్ధలు కొట్టడమే తన లక్ష్యమని టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం ఢిల్లీలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అట్టహాసంగా నిర్వహించిన 'నమన్ అవార్డుల' వేడుకలో ఈ 14 ఏళ్ల కుర్రాడు తన భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. టీమిండియా స్టార్స్ సంజు శాంసన్, హార్దిక్ పాండ్యా, అభిషేక్ శర్మలతో కలిసి వేదికను పంచుకున్న ఈ బీహార్ యువ కిరణం, ప్రముఖ వ్యాఖ్యాత హర్ష భోగ్లే అడిగిన ప్రశ్నకు తడుముకోకుండా సమాధానమిచ్చాడు. ఐపీఎల్‌లో నీవు బద్ధలు కొట్టాలనుకుంటున్న అతిపెద్ద రికార్డు ఏది అని హర్ష భోగ్లే అడగ్గా, 2013లో పూణే వారియర్స్‌పై గేల్ సాధించిన చారిత్రాత్మక స్కోరును అధిగమించడమే తన లక్ష్యమని వైభవ్ తన ఆత్మవిశ్వాసాన్ని చాటాడు. వైభవ్ మాటలు కేవలం అతిశయోక్తి కాదని అతని ఇటీవలి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2026 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై వైభవ్ సృష్టించిన విధ్వంసం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. కేవలం 80 బంతుల్లోనే 15 ఫోర్లు, 15 సిక్సర్లతో 175 పరుగులు సాధించి, అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అతని అద్భుత బ్యాటింగ్ వల్లే భారత్ రికార్డు స్థాయిలో ఆరోసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పటికే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న వైభవ్, 2025 సీజన్‌లో కేవలం 14 ఏళ్ల 32 రోజుల వయసులో గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. 35 బంతుల్లోనే వంద పరుగులు పూర్తి చేసి, క్రిస్ గేల్ తర్వాత ఐపీఎల్‌లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా, అలాగే ఒక భారతీయుడిగా ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026లో ఈ యువ వండర్ కిడ్ మరెన్ని సంచలనాలు సృష్టిస్తాడో అని విశ్లేషకులు మరియు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సెల్వ ప్రభుకు రజతం




**న్యూఢిల్లీ:** అమెరికా వేదికగా జరిగిన ఎన్‌సీఏఏ ఇండోర్ చాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ సెల్వ ప్రభు రజత పతకంతో మెరిశాడు. ఆదివారం జరిగిన పురుషుల ట్రిపుల్‌జంప్ ఫైనల్లో సెల్వ ప్రభు 17.05మీటర్ల ఎత్తు దూకి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. వరల్డ్ అథ్లెటిక్స్ అండర్-20 టోర్నీ రజత విజేత అయిన ప్రభు జాతీయ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన ప్రభు రెండో స్థానంలో నిలిచి సత్తాచాటాడు. జాతీయ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఏఎఫ్ఐ) కఠినమైన డోపింగ్ నిబంధనలతో అథ్లెట్లు తమ జాతీయ రికార్డుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.

# పాక్ క్రికెటర్ కొనుగోలుపై విమర్శలు..

## కావ్య మారన్‌ను నిలదీసిన గవాస్కర్

**ఢిల్లీ:** ఐపీఎల్ కోసం.. పాకిస్తాన్ క్రికెటర్‌ను కొనుగోలు చేసిన విషయంపై సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ నిర్ణయంపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ స్పందిస్తూ ఫ్రాంచైజీ యాజమాన్యంపై ప్రశ్నల వర్షం కురిపించారు.. ఇంగ్లాండ్‌లో నిర్వహించే ఫ్రాంచైజీ టోర్నమెంట్ ది హండ్రెడ్ కోసం జరిగిన ఆటగాళ్ల వేలంలో, సన్‌రైజర్స్ లీడ్స్ పాకిస్తాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ ను సుమారు రూ.2.34 కోట్లుకు కొనుగోలు చేసింది. సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు ాబఅ +తీశీబజూ యాజమాన్యంలో ఉంది. ఇదే సంస్థ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లోని సన్‌రైజర్ హైదరాబాద్‌జట్టును కూడా నిర్వహిస్తోంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. భారతదేశం-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో పాకిస్తాన్ ఆటగాడిని కొనుగోలు చేయడం ఎందుకు అన్న ప్రశ్నలు లేవనెత్తారు. వేలం సమయంలో హాజరైన ఫ్రాంచైజీ సీఈవో కావ్య మారన్ కూడా విమర్శలకు గురయ్యారు.

**గవాస్కర్ తీవ్ర వ్యాఖ్యలు**

ఈ అంశంపై తన కాలమ్‌లో స్పందించిన సునీల్ గవాస్కర్, గత కొన్ని సంవత్సరాల్లో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన సంఘటనలను పరిగణలోకి తీసుకుంటే ఇటువంటి ప్రతిచర్య సహజమని పేర్కొన్నారు. 2008లో జరిగిన 2008 ముంబై దాడుల తర్వాత పాకిస్తాన్ ఆటగాళ్లను ఇండియన్ ప్రీమియర్‌లీగ్‌లో ఆడనివ్వలేదని ఆయన గ ం ం త్త చేశారు. అలాగే 2019లో జరిగిన పుల్వామ అటాక్‌వంటి ఘటనలు భారతదేశంలో ప్రజల భావోద్వేగాలను ప్రభావితం చేశాయని తెలిపారు. భారత యాజమాన్యంలో ఉన్న జట్టు పాకిస్తాన్ ఆటగాడికి చెల్లించే డబ్బు అక్కడ పన్నుల రూపంలో ప్రభుత్వానికి చేరుతుందని, ఆ నిధులను ఆయుధాల కొనుగోలుకు ఉపయోగించే అవకాశముందని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. భారత యజమాని ఒక పాకిస్తాన్ ఆటగాడికి డబ్బు చెల్లిస్తే, అది పరోక్షంగా భారత సైనికులు లేదా పౌరులపై ప్రభావం చూపే వ్యవస్థకు నిధులు సమకూర్చినట్టే అవుతుంది. ఒక టోర్నమెంట్ గెలవడం భారతీయుల ప్రాణాల కంటే ముఖ్యమా?" అని ఆయన ప్రశ్నించారు.







TGTEL/25/A1737 | NETI SAKSHI

# ఆస్కార్ అవార్డుల వేడుకల్లో అరుదైన సంఘటన



## ఆస్కార్ అవార్డును సమానంగా గెలుచుకున్న రెండు సినిమాలు

అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ చోటు చేసుకుంది. దాదాపు 14 ఏళ్ల తర్వాత ఒకే విభాగంలో రెండు సినిమాలు సమానంగా నిలిచి ఆస్కార్ అవార్డును గెలుచుకున్నాయి. దీంతో డాల్బీ థియేటర్‌లో జరిగిన వేడుకలో ఈ సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం' కేటగిరీలో 'ది సింగర్స్' మరియు 'టు పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా' చిత్రాలు సంయుక్తంగా విజేతలుగా నిలిచాయి. ఈ అవార్డును ప్రకటించడానికి ప్రజెంటర్ కుమాయిల్ నంజియాని స్టేజ్‌పైకి వచ్చారు. అయితే ఎన్వలప్ తెరిచిన తర్వాత కొద్దిసేపు ఏమీ చెప్పకుండా ఉండడంతో అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోయారు. కొద్దిసేపటి తర్వాత ఆయన ఈ కేటగిరీ టై అయిందని, ఇద్దరు విజేతలు అవార్డును గెలుచుకున్నారని ప్రకటించారు. దీంతో డాల్బీ థియేటర్ మొత్తం చప్పట్లతో మార్మోగిపోయింది. ఆస్కార్ చరిత్రలో ఇలా ఒకే విభాగంలో ఇద్దరు విజేతలు రావడం ఇది ఏడోసారి కావడం విశేషం. అంతేకాకుండా 2012 తర్వాత మళ్లీ ఈ తరహా టై నమోదు కావడం ఇదే మొదటిసారి. అవార్డు ప్రకటించిన తర్వాత కుమాయిల్ నంజియాని సరదాగా స్పందిస్తూ, షార్ట్ ఫిలిం అవార్డు ఇవ్వడానికి ఇప్పుడు రెట్టింపు సమయం పడుతుంది

### ఆస్కార్ చరిత్రలో టై అయిన సందర్భాలు

- **1932** ఉత్తమ నటుడు (వాలెస్ బీరీ, ఫ్రెడ్రిక్ మార్చ్)
- **1949** బెస్ట్ డాక్యుమెంటరీ (ఏ ఛాన్స్ టు లివ్, సో మచ్ ఫర్ సో లిటిల్)
- **1968** ఉత్తమ నటి (కేథరిన్ హెప్బర్న్, బార్బరా స్ట్రీసాండ్)
- **1986** బెస్ట్ ఫీచర్ డాక్యుమెంటరీ (ఆర్టీ షా: టైమ్ ఈజ్ ఆల్ యూ హావ్ గాట్, డౌన్ అండ్ అవుట్ ఇన్ అమెరికా)
- **1994** బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం (ఫ్రాంక్ కాఫ్కాస్ ఇట్స్ ఏ వండర్ ఫుల్ లైఫ్, ట్రెవర్)
- **2012** ఉత్తమ సౌండ్ ఎడిటింగ్ (స్కైఫాల్, జీరో డార్క్ థర్టీ)
- **2026** బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం (ది సింగర్స్, టు పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా)

మొత్తానికి ఆస్కార్ 2026 వేడుకల్లో జరిగిన ఈ అరుదైన సంఘటన ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చింది. ఒకే కేటగిరీలో రెండు సినిమాలు విజేతలుగా నిలవడం సినీ ప్రపంచంలో అరుదైన ఘట్టంగా నిలిచింది.

## ఆస్కార్‌లో ధర్మేంద్ర, కోటలకు నివాళి

అద్భుతమైన నటనతో కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకొని.. గతేడాదిలో తుదిశ్వాస విడిచిన నటీనటులకు ఆస్కార్ నివాళులర్పించింది. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ ఆస్కార్ అవార్డుల వేడుకలో ప్రపంచవ్యాప్తంగా సినీరంగం కోసం కృషి చేసిన గొప్ప కళాకారులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో పాటు భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి దిగ్గజాల పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది. ఆస్కార్ వేడుక ప్రారంభంలో గతేడాది మరణించిన హాలీవుడ్ ప్రముఖులకు నివాళులర్పిస్తూ వీడియోను ప్రదర్శించారు. వారిని స్మరించుకుంటూ వారితో ఉన్న జ్ఞాపకాల గురించి కొందరు వేదికపై మాట్లాడారు. అయితే, ఆ వీడియోలో ధర్మేంద్రను చూపించకపోవడంతో అభిమానులు అసహనం వ్యక్తంచేస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్‌లు పెట్టారు. సమయాభావం వల్ల వీడియోలో కొందరినే చూపారని.. ఆ తర్వాత అందరి పేర్లను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారని హాలీవుడ్ మీడియా పేర్కొంది. 89 ఏళ్ల వయసులో గతేడాది నవంబర్ 24న ధర్మేంద్ర తుదిశ్వాస విడిచారు. సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్రం పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఇక 40 ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్ కలిగిన కోట శ్రీనివాసరావు గతేడాది జులై 13న మరణించిన విషయం తెలిసిందే.




## పగలు రాత్రి తేడా పని చేశా

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతున్న భారీ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక రాశీ ఖన్నా మీడియాతో పంచుకున్నారు.' నా కెరీర్ ఆరంభం నుంచే పవన్ కళ్యాణ్ గారి స్టార్డమ్, ఆయనకున్న 'పవనిజం' గురించి విన్నాను. ఆయనతో ఒక్క సినిమా అయినా చేయాలని కోరుకున్నాను, ఈ చిత్రంతో నా కల నెరవేరింది. పవన్ గారు చాలా నిరాడంబరంగా ఉంటారు, సెట్‌లో ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. ఆయనలోని మానవత్వం, ప్రజల పట్ల ఆయనకున్న ఆలోచనలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. ఈ సినిమాలో నేను 'శ్లోక' అనే మోడరన్ అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉండేలా దర్శకుడు హరీష్ శంకర్ డిజైన్ చేశారు. నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం, ఇందులో ఒక మాస్ సాంగ్ ఉంది, దాని షూటింగ్‌ను చాలా ఎంజాయ్ చేశాను. శ్రీలీల, నేను ఇద్దరం హీరోయిన్లము అయినప్పటికీ, ఎవరి ప్రాధాన్యత వారికుంది. దర్శకుడు హరీష్ శంకర్ గారికి మాస్ పల్స్ బాగా తెలుసు. సాధారణంగా 120 రోజులు పట్టే షూటింగ్‌ను తన ప్లానింగ్‌తో కేవలం 40 రోజుల్లోనే పూర్తి చేశారు. ఆయన అంకితభావం చూసి ఆశ్చర్యపోయాను. సెట్‌లోనే అప్పటికప్పుడు పంచ్ డైలాగ్స్ రాయడం ఆయన స్పెషాలిటీ. పవన్ కళ్యాణ్ గారి బిజీ షెడ్యూల్స్ వల్ల షూటింగ్ సమయంలో కొన్ని సర్దుబాట్లు చేయాల్సి వచ్చింది. పగలు, రాత్రి తేడా లేకుండా వరుసగా 24 గంటల షిఫ్టులు కూడా పని చేశాను. అయినా సరే, అటు పవన్ గారు, ఇటు మైత్రి మూవీ మేకర్స్ వంటి పెద్ద బ్యానర్‌లో పని చేయడం వల్ల ఆ కష్టం తెలియలేదు. ఈ సినిమా ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. 'గబ్బర్ సింగ్' చిత్రంలో పవన్ కళ్యాణ్ గారిని ఎలాగైతే చూశారో, మళ్ళీ అదే వింటేజ్ లుక్, ఎనర్జీని ఈ సినిమాలో చూస్తారు. ఉగాది పండుగ రోజున థియేటర్లలో ప్రేక్షకులకు ఇది ఒక విందు భోజనంలా ఉంటుంది.






## వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్

### ఆస్కార్‌లు పండించిన మూవీ

### ఏకంగా ఆరు ఆస్కార్‌లు ప్రదానం

కథలో బలం, పాత్రల మధ్య సంఘర్షణ ఉండాలే గానీ.. బాక్సాఫీసు లెక్కలతో పని లేకున్నా పురస్కారాల పంట పండుతుందని వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ సినిమా నిరూపించింది. సినీ రంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే అకాడమీ అవార్డుల్లో ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఆరు 'ఆస్కార్ లు అందుకుంది. బిడ్డ నమ్మకం గెలుచుకోవడం కోసం ఓ తండ్రి పడే తపనను హృద్యంగా తీర్చిదిద్ది ఉత్తమ దర్శకుడిగానూ అవార్డు అందుకున్నారు పాల్ థామస్ అండర్సన్. బ్లాక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రంలో లియోనార్డో డికాప్రియో కీలక పాత్ర పోషించారు. విప్లవకారుల గ్రూప్ ఫ్రెంచ్ 75లో సభ్యులైన ప్యాట్ కల్హౌన్ (లియోనార్డో డికాప్రియో), పెర్ఫిడియా బేవర్లీ హిల్స్ (టియానా టేలర్) సహజీవనంలో ఉంటారు. ఓ నిర్బంధ కేంద్రం నుంచి వలసదారులను విడిపించే క్రమంలో అక్కడి కమాండింగ్ అధికారి స్టీవెన్‌ను పెర్ఫిడియా అవమానిస్తుంది. దీంతో వీరిద్దరిపైనా అతడు పగ పెంచుకుంటాడు. ఆ తర్వాత ఓ కేసులో ఆమెను పట్టుకున్న స్టీవెన్.. తనతో ఏకాంతంగా గడిపితే విడిచిపెడతానని షరతు పెడతాడు. ఇందుకు పెర్ఫిడియా అంగీకరిస్తుంది. కొంతకాలానికి ఆమె బిడ్డకు జన్మిస్తుంది. కానీ, ఆ చిన్నారిని, తన భాగస్వామి ప్యాట్‌ను వదిలేసి మళ్లీ విప్లవం బాట పడుతుంది. ఈ క్రమంలోనే స్టీవెన్ సాయంతో మెక్సికోకు వెళ్లిపోతుంది. దీంతో ప్యాట్ ఒంటరి తండ్రిగా చిన్నారి చార్లీన్‌ను పెంచుతాడు. ఈ క్రమంలో వారికి ఎన్నో అవమానాలు ఎదురవుతాయి. మరోవైపు.. అవినీతి అధికారి అయిన స్టీవెన్ అమెరికా సెక్యూరిటీ ఏజెన్సీస్‌లో అగ్రస్థాయికి ఎదుగుతాడు. 16ఏళ్ల తర్వాత పెర్ఫిడియా జన్మనిచ్చిన చిన్నారికి తానే అసలైన తండ్రినని తెలుసుకున్న స్టీవెన్.. ఆమెను చంపేందుకు కుట్రలు పన్నుతాడు. ఈ విషయం తెలుసుకున్న ప్యాట్ అలియాస్ బాబ్.. ఇన్నాళ్లూ సొంతబిడ్డగా పెంచుకున్న చార్లీన్‌ను కాపాడేందుకు ఏం చేస్తాడు? ఆ పోరాటంలో అతని ఆలోచనలు, సంబంధాలు, నైతిక విలువలు ఎలా మారతాయి? స్వార్థం తన పరిస్థితులను ఎలా మార్చేసింది? తల్లి మీద కోపం, పెంచిన తండ్రి మీద అనుమానంతో ఎటూ తేల్చుకునే స్థితిలో ఉన్న చార్లీన్ నమ్మకాన్ని ప్యాట్ ఎలా గెలుచుకోగలిగాడు? అన్నదే ఈ చిత్ర కథ. 2000 నాటి వైన్‌లాండ్ నవల ఆధారంగా దర్శకుడు పాల్ థామస్ అండర్సన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గతేడాది సెప్టెంబరు 26న వార్నర్ బ్రదర్స్ నిర్మాణ సంస్థ ఈ సినిమాను విడుదల చేసింది. బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించకపోయినా.. అండర్సన్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. అటు విమర్శకుల ప్రశంసలతో పాటు అనేక పురస్కారాలు సాధించింది. తాజాగా జరిగిన ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డుల్లో మొత్తం 13 విభాగాల్లో ఈ సినిమా నామినేషన్లలో నిలిచింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ క్యాస్టింగ్, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో ఆరు పురస్కారాలు అందుకుంది. తండ్రి పాత్రలో లియో తన బిడ్డ కోసం పడే తపన ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉంది.



## ఆస్కార్‌లో మెరిసిన ఈషా అంబానీ

సినీ రంగ ప్రతిష్టాత్మక వేడుక 'ఆస్కార్ 2026' అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ తనయ ఈషా అంబానీ సందడి చేశారు. వింటేజ్ వాలెంటినో గౌన్‌లో రెడ్ కార్పెట్‌పై మెరిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. తన భర్త ఆనంద్ పిరమాల్‌తో కలిసి ఈషా అంబానీ ఆస్కార్ వేడుకకు హాజరయ్యారు. ఈషా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ఈవెంట్‌కు ముందు ఈషా అంబానీ అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఈ మ్యూజియంతో నీతా ముకేశ్ అంబానీ కల్చర్ సెంటర్ కలిసి పనిచేసే అంశాన్ని ఆమె చర్చించినట్లు సమాచారం. భారతీయ సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై ప్రతిబింబించడంతో పాటు ఇండియన్ సినిమాకు మరింత గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ఈషా అంబానీ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఆస్కార్ అవార్డుల కార్యక్రమంలో ఈషా పాల్గొనడం ఇదే తొలిసారి. ఆ మధ్య ఈమె మెట్ గాలాలో సందడి చేసిన సంగతి తెలిసిందే

Printed, Published and Owned by **SHAIK FAREED**, and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# అడిగేదెవరు.. ఆపేదెవరు







- సమయపాలన పాటించని కార్యదర్శులు...
- అటకెక్కిన ప్రజాపాలన కార్యక్రమం
- ఫేస్ రికగ్నిషన్ దుర్వినియోగంపై కలెక్టర్ దృష్టి పెట్టాలి
- మండల అధికారుల సహకారమే కార్యదర్శుల ఆయుధం
- విలేఖర్ల ఫిర్యాదుతో ఆదివారం కార్యాలయాలకు పరుగులు పెట్టిన కార్యదర్శులు

**నేటి సాక్షి, కోదాడ (అనంతగిరి):** ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లాలన్న సంకల్పంతో ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ పంచాయితీ లక్ష్యం నెరవేరడం లేదు.ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్యదర్శులు తమ విధులు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు.అధిక శాతం మంది ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. మరికొందరు హాజరు పట్టికలో సంతకాలు చేసి కార్యాలయాల్లో లేకుండా ఉడాయిస్తున్నారు.ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతున్న పంచాయతీ కార్యదర్శులు అనధికారికంగా విధుల నిర్లక్ష్యంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు లేక కాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కార్యాలయం ప్రజలకు సమాధానం చెప్పే అధికారులు లేకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీ అధికారులు సమయపాలన పాటించడం లేదని,ఎప్పుడు గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చిన కాళీ కుర్చీలతో దర్శనమిస్తున్నయని ప్రజలు వాపోతున్నారు.గ్రామంల్లో సమస్యను ఎవరికి చెప్పుకోవాలి తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ కార్యదర్శి సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి మండల వసూలు డిమాండ్ చేస్తున్నారు.

అటకెక్కిన ప్రజాపాలన 99రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామాల్లో ప్రస్తుతం అపరిశుధ్యం నెలకొంది. గ్రామ శివారు ప్రధాన వీధుల్లో చెత్త కుప్పలు స్వాగతం పలుకుతూ పరిసర నిర్వాసితు లకు ఇబ్బందిగా మారుతున్నాయి. చిన్న పంచాయతీల్లో సైతం ప్రభుత్వం పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేప డుతున్నా ప్రజల్లో అవగాహన లోపానికి సిబ్బంది నిర్లక్ష్యం తోడై సమస్య తీరడం లేదు. గ్రామంలో పలు వీధుల్లో గల చేతిపంపుల చుట్టూ ఉండే పరిశుభ్రత సమస్య చెప్పవలసినవి కావని తీవ్ర అపరిశుధ్యం మధ్య నీటిని పట్టుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నా యని, దీని వల్ల రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు.అడుగడుగునా డ్రైనే జీలు చెత్తతో నిండి ఉన్నాయి.పలు వీధుల్లో నెలల తర బడి పోగుబడి ఉన్న చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పరిస్థితికి తగ్గట్టుగా గ్రామాల్లో ఎక్కడ చూసినా కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలాలు కానరావడం లేదు.ఈ సమస్యలు పరిష్కరించడానికి పంచాయతీ అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ దృష్టి సారించకపోవడం దురదృ ష్టకరమైన విషయం.గ్రామంలో పారిశుధ్యం గురించి మండల స్థాయి అధికారులు కూడా పట్టించుకోకపోవ డమే ఈ పరిస్థితికి కారణమని గ్రామస్తులు ఆరోపి స్తున్నారు.గ్రామంలో పారిశుధ్యం గురించి పట్టించుకో వాల్సిన అధికారులు మచ్చుకైనా పట్టించుకున్న సంఘట నలు లేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధు లు పారిశుధ్యంపై దృష్టి సారించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.విలేఖర్ల ఫిర్యాదుతో ఆదివారం కార్యాలయాలకు పరుగులు పెట్టిన కార్యదర్శులు గ్రామ పంచాయతీలను అనంతగిరి విలేఖర్ల బృందం ఆదివారం పరిశీలించగా కార్యదర్శుల నిర్లక్ష్యం బట్టబయలైంది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన 99 రోజుల ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది దీనిలో భాగంగా అధికారులకు,ముఖ్యంగా గ్రామపంచాయతీ కార్యదర్శులకు సెలవు దినాలు రద్దు చేస్తూ ఆదివారం సైతం విధుల్లో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మాకు అవసరంలేదు అన్నట్టు మండల కార్యదర్శులు 10 దాటండి కార్యాలయాలకు హాజరు కావడం లేదు.సమయపాలన పాటించడం లేదని ఎవరైనా మండల అధికారులకు సమాచారం ఇస్తే ఏదో సాకులు చెబుతూ బురిడీ కొట్టిస్తున్నారు.దీనికి తోడు మండల అధికారులు సైతం సహకరించడంతో కార్యదర్శులకు ఆయుధంగా మారి అలసత్వానికి అడ్డు అదుపు లేకుండా పోయింది.

ఫేస్ రికగ్నిషన్ దుర్వినియోగంపై కలెక్టర్ దృష్టి పెట్టాలి

పంచాయతీ రాజ్ అధికారులు సమయపాలన పాటిస్తూ విధుల నుంచి దుమ్మాలు కొట్టకుండా,గ్రామాల్లో సేవలు అందించేందుకు పంచాయతీ రాజ్ శాఖ ముఖ గుర్తింపు హాజరు ఫేస్ రికగ్నిషన్ యాప్ విధానాన్ని అమలులోకి తెచ్చింది.విధానం ప్రకారం ప్రతీరోజు పంచాయతీ కార్యదర్శులు తాము విధులు నిర్వహిస్తున్న గ్రామం నుంచే ఉదయం 10 గంటల లోపే ఫేస్ రికగ్నిషన్ ద్వారా పంచాయతీ రాజ్ యాప్లో హాజరు నమోదు వేసుకోవాలి.అయితే కొందరు పంచాయతీ కార్యదర్శులు విధులకు ఎగనామం పెడుతూ డిజిటల్ అటెండెన్స్ యాప్ను దుర్వినియోగం చేస్తున్నట్లు సమాచారం...? కార్యాలయంలోనే ఉన్నట్లు తీసిన ఫొటోను యాప్లో పెడుతూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు.జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించి ఫేస్ రికగ్నిషన్ యాప్ దుర్వినియోగం చేస్తున్న కార్యదర్శులు పైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



# యుద్ధం సాకుతో గ్యాస్ ధర పెంచొద్దు

**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ యుద్ధ పరిస్థితులను సాకుగా చూపిస్తూ కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచే ప్రయత్నాలు చేయకూడదని సిపిఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగం కృష్ణ ఘాటుగా విమర్శించారు. సాధారణ ప్రజలపై అదనపు భారాన్ని మోపే విధానాలను తక్షణమే విరమించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సిపిఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగం కృష్ణ మాట్లాడుతూ, అంతర్జాతీయ యుద్ధాలను కారణంగా చూపి దేశంలోని సామాన్య ప్రజలపై భారాన్ని మోపడం కేంద్ర ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, గ్యాస్ ధరలు పెంచడం ప్రజలపై మరింత దెబ్బ అవుతుందని అన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు స్వర్గం రాజేశం మాట్లాడుతూ, అమెరికా సామ్రాజ్యవాద చర్యలను తీవ్రంగా ఖండించారు. ఇరాన్‌పై ఆధిపత్యం సాధించాలనే ఉద్దేశంతో జరుగుతున్న యుద్ధ చర్యలు ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్నాయని అన్నారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ ఇరాన్‌పై జరుపుతున్న దాడుల వల్ల ప్రపంచంలోని కీలక ఆయిల్ నిల్వలు ప్రమాదంలో పడుతున్నాయని, దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్ ధరలు పెరిగి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని దేశంలో గ్యాస్ కొరత రాకుండా చూడాలని, ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సిపిఐ డిమాండ్



చేసింది. దేశ ప్రధానమంత్రి అమెరికాపై ఒత్తిడి తీసుకువచ్చి యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నించాలని కూడా వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మొట్ట శ్రీను, గజ్వేల్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు టంప చంద్రం శీను, సిపిఐ నాయకులు పోతుల శంకరయ్య, నర్సింలు, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.చాలని సూచించారు. అలాగే ఆరోగ్య రక్షణ, వైద్య సౌకర్యాల మెరుగుపరచాలని తెలిపారు. ముదిరాజ్ సమాజానికి చెందిన యువతకు విద్యా, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు పెంచితే వారి భవిష్యత్తు బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలైతే సమాజంలో వారి స్థాయి మరింత మెరుగుపడుతుందని అన్నారు. ముదిరాజులు అనుభవజ్ఞులు, సమాజానికి మార్గదర్శకులు. వారికి గౌరవం, అవసరమైన సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని సబ్బని శ్రీనివాస్ అన్నారు. సమాజంలోని ప్రతి వ్యక్తి, సంఘాలు కలిసి ముదిరాజుల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సామాన్యుడిపై గ్యాస్ భారం వద్దు



**నేటి సాక్షి చిలుకూరు (మొక్క వెంకన్న గౌడ్):** చిలుకూరు మండల కేంద్రంలో యుద్ధ పరిస్థితులను సాకుగా చూపిస్తూ కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచుతూ సాధారణ ప్రజలపై అదనపు భారాన్ని మోపే విధానాలను తక్షణమే విరమించాలని సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి మండల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అంతర్జాతీయ యుద్ధాలను కారణంగా చూపి దేశంలోని సామాన్య ప్రజలపై భారాన్ని మోపడం కేంద్ర ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, గ్యాస్ ధరలు పెంచడం ప్రజలపై మరింత భారం అవుతుందని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాద చర్యలను తీవ్రంగా ఖండించారు. ఇరాన్‌పై ఆధిపత్యం సాధించాలనే ఉద్దేశంతో జరుగుతున్న యుద్ధ చర్యలు ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్నాయని అన్నారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ ఇరాన్‌పై జరుపుతున్న దాడుల వల్ల ప్రపంచంలోని కీలక ఆయిల్ నిల్వలు ప్రమాదంలో పడుతున్నాయని, దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్ ధరలు పెరిగి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని దేశంలో గ్యాస్ కొరత రాకుండా చూడాలని, ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సిపిఐ డిమాండ్ చేసింది. దేశ ప్రధానమంత్రి అమెరికాపై ఒత్తిడి తీసుకువచ్చి యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నించాలని కూడా వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండవ ప్రధాన కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు సహాయ కార్యదర్శి. సాహెబ్ అలీ చిలువేరూ ఆంజనేయులు పిల్లుట్ల కనకయ్య కస్తూరి సైదులు మహబూబా బేగం మాచర్ల వెంకటి తదితరులు పాల్గొన్నారు..

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**నేటి సాక్షి..చిలుకూరు** కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన.. ఎమ్మార్వో ధ్రువ కుమార్ ఆర్ఐ శ్వేత ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలను ఆదుకోవడానికి ప్రతిష్టాత్మక చేపట్టిన కళ్యాణలక్ష్మి కార్యక్రమం భాగంగా ప్రతి కుటుంబలో ఆడపడుచు పెళ్లికి తన వంతు సహాయంగా ప్రభుత్వ సహకారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఏడు కుటుంబాలకు తంగేళ్ళపల్లి భార్గవి సిద్ధల మనీషా సుల్తాన్ యల్లేశ్వరి కైలాసపు శ్రీవిద్య భోగ్యం రక్షిత శివరాత్రి దీపిక చిలువేరు భవాని లబ్ధిదారులకు సుమారు 9 లక్షల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు గ్రామ సర్పంచ్ కొల్లు పులమ్మజూ నాగయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గీత వెంకన్న వర్కింగ్ ప్రెసిడెంట్ యాడవెల్లి పుల్లారావు సీతారాంపురం సర్పంచ్ పులగం లక్ష్మినారాయణ వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు..

## బిజెపి సర్పంచులుగా గెలిచిన అభ్యర్థులకు నిధులు మంజూరు

**నేటి సాక్షి, గన్నేరువరం(బుర్ర అంజయ్య గౌడ్):** మండలంలోని నాలుగు గ్రామపంచాయతీలకు ఒక్కొక్క గ్రామ పంచాయతీకి 15 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు బిజెపి మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ తెలిపారు మండలంలోని గునుకుల కొండాపూర్, పీచుపల్లి, మైలారం, గ్రామాలకు సిసి రోడ్లు మంజూరు చేసినందుకు కరీంనగర్ ఎంపీ కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు సొల్లు అజయ్ వర్మ సామ రాజిరెడ్డి గాలి పెల్లి పోశవ్వ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు



# వరస దాడుల్లో పెద్దపులి

## పట్టించుకోని అధికారులు



**నేటి సాక్షి.కొడిమ్యాల:** కొడిమ్యాల మండలం సూరంపేట గంగారం తండా అటవీ సమీపంలో శనివారం రాత్రి తేజావత్ నారాణ్య. రోజు లాగానే పొలం పనులు ముగించుకుని సాయంత్రం తనకు ఉన్న ఆవు గేదెలను. తన పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చి పొద్దున వెళ్లి చూసేసరికి తన ఆవు దూడని పెద్దపులి దాడి చేసి చంపిందని సమాచారం ఇవ్వగా. అటవీశాఖ అధికారులు వెళ్లి పరీక్షించి అది పెద్దపులి దాడి అని నిర్ధారించి. తగు సూచనలు ఇచ్చారు. అదే తరహా ఆదివారం రాత్రి మళ్లీ పెద్దపులి తేజావత్ గోరీకి చెందిన ఆవు దూడపై దాడి చేసి చంపి తిన్నది. ఇలా వరుసదాడుల్లో పెద్దపులి రోజు దాడి చేయడం వలన గ్రామస్తులు మండలంలోని చుట్టుపక్క గ్రామాలన్నీ భయంద్దోనలలో ఉన్నారు. కాబట్టి తగిన అటవీశాఖ అధికారులు స్పందించి. పెద్దపులిని పట్టుకోవడానికి తగు చర్యలు చేపట్టి. పెద్దపులి భారం నుండి ప్రజలను మూగజీవాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# మాట నిలబెట్టుకున్న సర్పంచ్

## ప్రతి ఆడబిడ్డ పెండ్లికి 1016 రూపాయలు కానుకగ



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నాగంపేట గ్రామపంచాయతీలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాగంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్. గజ్జి లింగయ్య మరియు వార్డుసభ్యులు ఆదివారం నేడు ఆడబిడ్డ పెళ్లికి రూ.1016 నగదు అందజేశారు. గ్రామా నికి చెందిన గజ్జి శ్రీనివాస్-సూర్య దంపతుల కుమార్తె వివాహానికి హాజరై కానుకను అందజేశారు. ఈ గ్రామంలో ఈ యొక్క ఆడబిడ్డ పెండ్లికి తప్పకుండా హాజరై ప్రతి ఒక్కరికి ఇచ్చిన మాట ప్రకారం గా కానుక అందజేస్తామని తెలిపినారు కార్యక్రమంలో గజ్జి పురుషోత్తం మరియు నాగం పేట వార్డు.సభ్యు లు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు



**నేటి సాక్షి,కుమురం భీమ్ ఆసిఫాబాద్ :**జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఫిర్యాదుదారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విని, వాటిని చట్టపరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా సంబంధిత డీఎస్పీ, ఏఎస్పీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల స్థితిగతులను తెలుసుకుని అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తుల ప్రమేయం లేకుండా నేరుగా పోలీసులను సంప్రదించి తమ సమస్యలను చట్టప్రకారం పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి, శాంతి భద్రతలను కాపాడుతూ పోలీస్ శాఖ పని చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, బాధితులు మరియు సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు

# పాఠశాల పక్కనే మద్యం షాపు సెట్టింగులు



**నేటి సాక్షి నారాయణపేట, (ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని కన్మనూరు గ్రామంలో మద్యం సిట్టింగ్లు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పక్కనే ఈ మద్యం షాపు ఉండటంతో విద్యార్థులపై చెడు ప్రభావం పడుతుందని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిసరాల్లోనే మద్యం విక్రయాలు జరగడం వల్ల అటుగా వెళ్లే మహిళలు మరియు చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థలకు సమీపంలో నడుస్తున్న ఈ బెల్ట్ షాపులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నారాయణపేట జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి కన్మనూరు గ్రామంలోని పాఠశాల పక్కన ఉన్న మద్యం బెల్ట్ షాపును మరియు సిట్టింగ్లను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు సామాన్య ప్రజల మరియు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# జిల్లాలో మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



- నిజామాబాద్ ఎంపీ అరవింద్ ధర్మపురి
- కొనుగోలు కేంద్రాల ఆలస్యంతో రైతులకు నష్టం
- ఎంఎస్పి రూ.2400 ఉన్నా రూ.1700-1800కే అమ్మకాల పరిస్థితి
- ప్రతీ రైతుకు రూ.20వేల నుంచి 25వేల వరకు నష్టం
- తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంపీ లేఖ

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లాలో మక్క రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిజామాబాద్ ఎంపీ అరవింద్ ధర్మపురి స్పందిస్తూ వెంటనే మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం కారణంగా రైతులు తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని, దీని వల్ల భారీ నష్టం వాటిల్లుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### కొనుగోలు కేంద్రాల లేమితో రైతుల ఇబ్బందులు

జగిత్యాల జిల్లాలో ఈ ఏడాది విస్తృతంగా మక్క పంట సాగు చేయబడింది. అనుకూల వాతావరణ పరిస్థితుల వల్ల దిగుబడి కూడా అధికంగా వచ్చింది. అయితే పంట కోతలు పూర్తయ్యాక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో జాప్యం జరగడం రైతులకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ పంటను నిల్వ చేసుకునే పరిస్థితి లేక ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకానికి దిగుతున్నారు.

### ఎంఎస్పి ప్రకటించినా ప్రయోజనం లేకుండా పరిస్థితి

కేంద్ర ప్రభుత్వం మక్కకు కనీస మద్దతు ధర (ఎంఎస్పి)గా రూ.2400 నిర్ణయించినప్పటికీ, జిల్లాలో ఆ ధరకు కొనుగోలు జరగడం లేదు. వ్యాపారులు క్వింటాల్‌కు రూ.1700 నుంచి రూ.1800 మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో మార్కెట్‌లో కనీస మద్దతు ధర అమలు కాకపోవడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది.

### భారీ ఆర్థిక నష్టం-ఎంపీ ఆందోళన

ఈ పరిస్థితుల కారణంగా ప్రతి రైతు సగటున రూ.20,000 నుంచి రూ.25,000 వరకు నష్టపోతున్నారని ఎంపీ అరవింద్ ధర్మపురి పేర్కొన్నారు. పంట పెట్టుబడులు, ఎరువులు, కార్మిక వ్యయాలు పెరిగిన నేపథ్యంలో రైతులకు ఇది తీవ్రమైన ఆర్థిక భారం అవుతుందని ఆయన తెలిపారు.జగిత్యాల జిల్లాలో వెంటనే మక్క కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, రైతుల నుంచి కనీస మద్దతు ధరకు పంట కొనుగోలు చేయాలని ఎంపీ కలెక్టర్‌ను కోరారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తూకం, రవాణా, చెల్లింపుల వ్యవస్థలను సమర్థంగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు.

### అదనపు ఏర్పాట్లపై సూచనలు

మక్క కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతం (మాయిశ్చర్) పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని, రైతులకు అనవసరంగా తిరస్కరణలు ఇవ్వకుండా చూడాలని ఎంపీ సూచించారు. అలాగే గోదాములు, నిల్వ సదుపాయాలు పెంచి రైతులు పంటను భద్రపరుచుకునేలా చూడాలని చెప్పారు. రైతులకు సమీపంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రవాణా ఖర్చులు తగ్గుతాయని ఎంపీ అభిప్రాయపడ్డారు.

# ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి



- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్
- ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య - 57

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ అధికారులను అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ..పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు.అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 57 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై ప్రత్యక్ష విచారణ

- గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుల పరిశీలన.. బాధితులకు న్యాయం చేయాలి
- ఎస్పీ అశోక్ కుమార్
- జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల అర్జీల స్వీకరణ
- 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ
- సత్వర చర్యలకు అధికారులకు ఆదేశాలు



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 14 మంది అర్జీదారులతో ఎస్పీ అశోక్ కుమార్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుల స్వరూపాన్ని అర్థం చేసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి వినతులను స్వీకరించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని



**నేటిసాక్షి, నల్లబెల్లి:** పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో సిపిఐ ఆధ్వర్యంలో గ్యాస్ పొయ్యికి పూలమాలవేసి కట్టెల పొయ్యి పై వంటచేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతకింది కుమారస్వామి పాల్గొని మాట్లాడుతూ... అమెరికా ఇజ్రాయిల్ ఉమ్మడిగా ఇరాన్తో యుద్ధానికి సిద్ధమయ్యే సూచనలు ప్రపంచానికి తెలిసినప్పటికీ మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు అవసరమైన గ్యాస్ చమురు నిలువలను పెంచుకోవడానికి ఎలాంటి కృషి చేయకుండా యుద్ధాన్ని ఆసరాగా చేసుకుని గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపినందన్నారు. యుద్ధ సమయంలో దేశంలో 50 రోజులకు సరిపడా మాత్రమే గ్యాస్ డీజిల్ పెట్రోల్ నిలువలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతుందన్నారు. ఇందులో కూడా 50 శాతం నిలువలను దేశ సైన్యానికి కేటాయిస్తూ మిగతా 50 శాతం నిల్వలను మొత్తం 140 కోట్ల ప్రజలకు కేటాయించారన్నారు .ఈ నిల్వలు అతివేగంగా తరుగుతున్నాయని ఈ క్రమంలో గ్యాస్ కంపెనీలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని గృహ, వ్యాపార గ్యాస్ సిలిండర్లను దొరకకుండా బ్లాక్ చేస్తున్నట్టు పరిస్థితులను బట్టి అర్థమవుతుందన్నారు .కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్, డీజిల్, పెట్రోలు నిలువలు తగినంత ఉన్నాయని దేశ ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని చెబుతున్నప్పటికీ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే చిరు వ్యాపారస్తులు,హోటల్లు, రెస్టారెంట్లు దాదాపుగా మూసివేస్తున్నారన్నారు. అదేవిధంగా జోమాటో స్విగ్గీ వర్కర్లు వేలాదిమంది ఉపాధి కోల్పోతున్నారన్నారు.ఈ పరిస్థితుల్లో ప్రధానమంత్రి మోడీ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పాటించకుండా ట్రంపుకు తలొగ్గడంతోనే భారత పరిస్థితి దిగజారిందన్నారు.ఇరాన్ పై చేస్తున్న యుద్ధానికి నిరసనగా, ట్రంప్ నెతన్యాహూ , మోడీ చిత్రపటాలను ప్రదర్శించారు .ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వైనాల వీరస్వామి, సిపిఐ మండల కార్యదర్శి కడియాల క్రాంతి కుమార్,మామిండ్ల అయిలయ్య, పిట్టల రామస్వామి,శ్రీహరి,బిట్ల సారంగం,సామల దేవేందర్,సారంగం, నారాయణస్వామి, బాబురావు,మల్లారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# పద్మశాలి సంఘం అడ్‌హాక్ చైర్మన్‌గా గంగుల సంతోష్





- మార్కండేయ భవనంలో అత్యవసర సమావేశం
- పాత కమిటీ రద్దు - కొత్త అడ్‌హాక్ కమిటీ ఏర్పాటుకు ఏకగ్రీవ తీర్మానం
- ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయం

**నేటి సాక్షి - మెట్‌పల్లి,( రాధారపు నర్సయ్య ):** మెట్‌పల్లి పట్టణంలోని మార్కండేయ భవనంలో జరిగిన పద్మశాలి సంఘం అత్యవసర సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ, పాత కమిటీని రద్దు చేసి నూతన అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా గంగుల సంతోష్‌ను ఎంపిక చేయగా, సంఘ కార్యకలాపాలు మరియు మార్కండేయ మందిర నిర్మాణ బాధ్యతలను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. గత కమిటీ మూడేళ్ల పదవీకాలం ముగియడంతో సమావేశంలో ఆ కమిటీని రద్దు చేస్తూ కొత్త అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా గంగుల సంతోష్‌ను ఎన్నుకోగా, సలహాదారులుగా సాంబారి ప్రభాకర్, గుంటుక విష్ణు, కేసుల సురేందర్ నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా జిల్లా వెంకటేశ్వర్లు, ధర్మపురి వేణుగోపాల్, గుంటుక సదాశివ్, చిలువేరి హన్మండ్లు, సంకు ఆనంద్, భీమనాతి సత్యం, మామిడాల శంకర్, సాంబారి శ్రీనివాస్, జోగ జగదీశ్వర్, పోతు సత్యనారాయణ, ఆడెపు రమణ, బోగ రాజగంగారాం, మ్యాన సతీష్, జోగ రాజగంగారాం, బండి రవి, అందె గంగాధర్, అన్నారపు వంశీ, గాజెంగి రాజన్న తదితరులు ఎంపికయ్యారు. సంఘ కార్యకలాపాలతో పాటు మార్కండేయ మందిర నిర్మాణ పనులను పర్యవేక్షించే బాధ్యతలను ఈ కమిటీకి అప్పగించారు. ఈనెల 19న జరగనున్న ఉగాది వేడుకలను నూతన అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. అదే సమావేశంలో ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో 7వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన ధర్మపురి స్వరూప వేణుగోపాల్‌ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, వివిధ వార్డుల అధ్యక్షులు, సుమారు 150 మంది సభ్యులు పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.

# అంబేద్కర్ విగ్రహ గద్దె కూల్చివేతపై ఆగ్రహం



- యువతపై కేసులు వెంటనే ఎత్తివేయాలి: యాదగిరి ముదిరాజ్

**నేటి సాక్షి గజ్వేల్ :** రాజ్యాంగ నిర్మాత BRఅంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను కూల్చివేయడం దురదృష్టకరమని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వర్గల్ మండలం నాచారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను కూల్చివేసిన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడని అన్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమని అంబేద్కర్ చెప్పిన ఆలోచనల స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. అందరి ఆరాధ్యదైవమైన అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం దురదృష్టకరమని ఆయన మండిపడ్డారు. విగ్రహ గద్దె నిర్మాణంలో పాల్గొన్న యువతపై పోలీసులు కేసులు నమోదు చేయడం అన్యాయమని, వెంటనే ఆ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రహదారికి సమీపంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తూ సంబంధిత అధికారులు వెంటనే అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. ఇలాంటి సున్నితమైన అంశాలను ఏకపక్ష నిర్ణయాలతో పరిష్కరించడం సాధ్యం కాదని, అన్ని వర్గాలతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని యాదగిరి ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.

# అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద సేవకు శ్రీకారం




- పితృదేవతల ఆశీస్సులతో సేవా కార్యక్రమం ప్రారంభం
- నిరుపేదలకు అన్నదానం - మహా పుణ్యకార్యం

**నేటి సాక్షి - మెట్‌పల్లి,( రాధారపు నర్సయ్య ):** మెట్‌పల్లి పట్టణంలో 'అమ్మా ఛారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద సేవ కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీన ఘనంగా ప్రారంభించనున్నారు. పితృదేవతలను స్మరించుకునే అమావాస్య రోజున నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా నిరుపేదలకు ఆహారం అందించడంతో పాటు దాతలకు పుణ్యఫలం చేకూరుతుందని నిర్వాహకులు తెలిపారు.

## పితృదేవతల స్మరణతో అన్నదానం

అమావాస్య రోజు పితృదేవతలను స్మరించుకోవడం భారతీయ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగి ఉంది. ఈ రోజున వారి పేరుమీద దానం చేయడం ద్వారా వారికి శాంతి చేకూరుతుందని, వారి ఆశీస్సులు మనకు లభిస్తాయని పెద్దలు చెబుతుంటారు. ఈ భావంతోనే అమ్మా ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతి నెల అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. 'అన్నదానం అన్నిటికంటే మిన్న' అనే నానుడిని ఆచరణలో పెట్టుతూ ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం ద్వారా సమాజానికి సేవ చేయడం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

## నిరుపేదలకు ఆహారం - దాతలకు పుణ్యం

ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలనుకునే వారు ప్రతి నెల అమావాస్యకు ముందు రోజు రూ.200 విరాళంగా అందించవచ్చని తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలోని పాత మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రతి అమావాస్య రోజున ఈ అన్నప్రసాద సేవ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పట్టణ ప్రజలు, దాతలు పెద్ద ఎత్తున పాల్గొని సహకరించాలని ట్రస్ట్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి.

- ప్రజావాణిలో 119 దరఖాస్తుల స్వీకరణ.
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.

**నేటి సాక్షి వికారాబాద్ :** ప్రజావాణి లో 119 దరఖాస్తులు స్వీకరణ ప్రజావాణికి ప్రజలు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వస్తారని, వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 119 పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ,

జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,.ప్రజా ప్రతినిధులునిర్వహించిన కార్యక్రమాలను తప్పని సరిగా ఫోటోలు పంపించాలని సూచించారు.



ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హార్ష్ చౌదరి జడ్.పి సి ఇ ఓ సుధీర్,ఆర్ డి ఓ వాసు చంద్ర,ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల జోలికొస్తే ఆమరణ దీక్ష చేస్తా

### జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్......




**నేటి సాక్షి,నారాయణపేట,( ఇమామ్ సాబ్ ):** నారాయణ పేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే పీఏ, కాంగ్రెస్ పార్టీ రెడ్డి దొరల ఆగడాలు శృతిమించిపోతున్నాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ ఆరోపించారు.సోమవారం నారాయణ పేట పట్టణ కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధన్వాడ మండలం చీకర్ల గడ్డ తండాకు చెందిన ఎస్టీ గిరిజనులు గత 70 ఏండ్లుగా సర్వే నంబర్ 708లో 5-37 గుంటల భూమిని సాగు చేసుకుంటూ,పట్టా హక్కులు పొంది ఉన్నారని, ప్రస్తుతం రైతుల నుండి బలవంతంగా ఆ భూమిని లాక్కోవడానికి కొండాపూర్ గ్రామానికి చెందిన అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ రెడ్డి,మాధవ రెడ్డి,మరికొంత మంది ఎమ్మెల్యే అనుచరులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ధన్వాడ మండలంలో ఎమ్మెల్యే అనుచరులు,కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. న్యాయం కోసం బాధిత గిరిజన రైతులు ఎమ్మెల్యే బంగళాకు పోతే వాటాలు అడగడం అత్యంత దుర్మార్గమన్నారు. నారాయణ పేట నియోజకవర్గంలో ప్రజా పాలనా నడుస్తున్నదా? లేక రెడ్డిల పాలన నడుస్తున్నదా? అంటూ ప్రశ్నించారు.గిరిజన రైతుల భూముల జోలికొస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యే కార్యాలయం ముందు బాధిత రైతుల కోసం ఆమరణదీక్ష కు సిద్ధమన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఎస్సీ ఎస్టీ కమీషన్,మానవ హక్కుల కమీషన్ కు పిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు అశోక్,అజయ్ కుమార్,వెంకటన్న ముదిరాజ్,శివ,బాధిత రైతులు సంజీవ్ నాయక్,బాలు నాయక్,పాండు నాయక్,గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విశారదన మహారాజును వెంటనే విడుదల చేయాలి

### రాస్తారోకో నిర్వహించిన బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు



**నేటి సాక్షి చిలుకూరు :** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులని పరామర్శించడానికి వెళ్లిన బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అక్రమ అరెస్టును ఖండిస్తూ విశారదన్ మహరాజ్ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చిలుకూరు మండల కేంద్రంలో రోడ్డు రాస్తారోకో నిర్వహించిన బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు, ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి మేరిగ సైదాబాబు మాట్లాడుతూ వెంటనే విశారాధన్ మహారాజు ను విడుదల చేయకపోతే నేషనల్ హైవేలను దిగ్భందిస్తామని హెచ్చరించారు... ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మహేష్ మాదిగ జాగృతి సంఘం నాయకులు బొడ్డుపల్లి వంశీ పార్టీ కుమ్మెర సంఘం నాయకులు కార్తీక్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మారోజు సైదాచారి తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల్లో కుల వివక్షను రూపుమాపాలి



**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు మండలం ఆచార్యుల గూడెంలో కుల వివక్ష గ్రామానికి చెందిన శ్రీ కోదండ రామాలయ కమిటీ గత కొద్ది రోజుల కింద వేయడం జరిగింది ఈ కమిటీలో కులాల ప్రతిపాదికన ఆధిపత్య కులాలు అగ్రకులాలు మాత్రమే అధ్యక్షులుగా ధర్మకర్తల మండలి సభ్యులుగా ఉంటున్నారు ఈ కమిటీలో అసలు గ్రామాన్ని నిర్మించి గ్రామ స్థలదాతలుగా, ఆలయ స్థల దాతలుగా, గ్రామ ప్రధాన రోడ్ల దాతలుగా ఉన్న దళిత బీసీ జాతులు కల్పించట్లేదు ఆ జాతులు మాదిగ, కుమ్మరి, చాకలి, విశ్వబ్రాహ్మణ, నాయి బ్రాహ్మణ, గౌడ కులాలకు చెందిన వారిని మీరు సమాజంలో పనిబాటు వారు, మాకు సేవ చేయడానికి ఉన్నవారు అని చెప్పి అవమానకరంగా, వెలివేసిన వారిగా చూస్తున్నారు. కావున గ్రామంలో సామాజిక న్యాయం సమానత్వం కల్పించి గ్రామంలో పర్యటించి దేవాలయ కమిటీలో అన్ని కులాలను తీసుకొని దేవాలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకొని దేవాలయానికి ఉన్న ఐదు ఎకరాల భూమిని కూడా దేవాదాశాఖ పరిధికింది తీసుకురావాలని గ్రామస్తులు అందరూ కలిసి చిలుకూరు మండలం తాసిల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ జేఏసీ కన్వీనర్ మేరుగ సైదాబాబు, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డుపల్లి సైదులు, బొడ్డుపల్లి సురేష్ గ్రామస్తులు రావులపెంట భాను, వెంకటనారాయణ, బొడ్డుపల్లి సురేష్, గండు వెంకన్న, మారోజు సైదాచారి, బొడ్డుపల్లి వంశీ, పారెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు

TGTEL/25/A1737 | NETI SAKSHI

# కిష్టాపూర్‌లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ

- జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల.
- భారత గడ్డపై హరిత విప్లవంతో కరువును చీల్చి చెండాడిన మహా గొప్ప నేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్.
- బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోలీస్ వెంకట్ రెడ్డి.
- ముఖ్య అతిథులు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ .



**నేటి సాక్షి వికారాబాద్ :** మహనీయులు రాజకీయ కోవిదులు భారత ఉప ప్రధానమంత్రి హరిత విప్లవ ప్రధాత కార్మిక పక్షపాతి భారత దేశంలో అతి చిన్న వయసులో ముఖ్యంగా దళిత సామాజిక వర్గం లో పుట్టి ఎన్నో పదవులను అధిరహించిన మహనీయులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అంతేకాకుండా ప్రపంచంలోనే అతి ఎక్కువ కాలం పార్లమెంట్ మెంబర్గా పనిచేసిన ఘనత ఆయనది అదేవిధంగా ఎన్నోసార్లు ఉత్తమ పార్లమెంటరీగా పేరు తెచ్చుకున్న వ్యక్తి ఈస్ట్ వెస్ట్ పాకిస్తాన్ యుద్ధంలో భారత రక్షణ శాఖ మంత్రిగా ఉండి బంగ్లాదేశ్ కి విముక్తి కలిగించిన మరో గొప్ప ఘన కీర్తిని అందుకున్న మహనీయులు ఆయన విగ్రహాన్ని ఏప్రిల్ నాలుగవ తేదీన కిష్టాపూర్ గ్రామం దోమ మండలం బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాది విచ్చేస్తున్న సందర్భంగా ఈరోజు జిల్లా హెడ్ క్వార్టర్ లోని బారాసోసియేషన్ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పోలీస్ వెంకటరెడ్డి జాయింట్ సెక్రటరీ పి ఆనంద్ సీనియర్ న్యాయవాదులు లవ కుమార్ గోవర్ధన్ రెడ్డి రామచంద్ర రావు జనార్ధన్ రెడ్డి అశోక్ కుమార్ మహేష్,శుభప్రద్ పటేల్ మహేష్ రెడ్డి, చైతన్య కిరణ్, అశోక్,సిహెచ్ వెంకటేష్, యూత్ అధ్యక్షులు యాదగిరి ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రీజనల్ రింగ్ రోడ్ భూ సేకరణకు రైతులు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ కె. హైమావతి**



**నేటి సాక్షి గజ్వేల్ :** రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. భూ సేకరణకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన నియమావళి ప్రకారం రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందజేస్తామని ఆమె హామీ ఇచ్చారు. సోమవారం గజ్వేల్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోతున్న జగదేవ్ పూర్ మండలం చెబర్తి, అల్రాజీపేట, పిర్లపల్లి, ఇటుక్యాల గ్రామాల రైతులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సేకరణలో భాగంగా చేపట్టే ఆర్బిట్రేషన్ ప్రక్రియ గురించి రైతులకు వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణం జరగడం వల్ల ఈ ప్రాంతానికి అభివృద్ధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజల అవసరాల కోసం తమ భూములను త్యాగం చేస్తున్న రైతుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. భూమి కోల్పోతున్న ప్రతి రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన విధానాల ప్రకారం సరైన నష్టపరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ సేకరణ ప్రక్రియలో ఎవరికి ఎలాంటి అన్యాయం జరగకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తవ్వాలంటే రైతులు సహకరించాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలకు అందరూ తోడ్పడితే ప్రాంతం త్వరగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ నిర్మలతో పాటు సంబంధిత శాఖల అధికారులు మరియు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో గౌరవం పొందిన పట్లోళ్ల హనుమంత్ రెడ్డి



- బహుజన సాహిత్య అకాడమీ 18వ ఆల్ ఇండియా రైటర్స్ వేదికలో జాతీయ సేవారత్న అవార్డు ప్రదానం
- గ్రామాభివృద్ధికి చేసిన విశేష సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు
- పేదలకు అండగా నిలిచి సామాజిక సేవలో ముందున్న నాయకుడికి అరుదైన సత్కారం
- సీసీ రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీటి సదుపాయాలతో గ్రామ అభివృద్ధికి కృషి
- గ్రామ ప్రజల సహకారంతోనే ఈ గౌరవం సాధ్యమైందని హనుమంత్ రెడ్డి కృతజ్ఞతలు



**నేటి సాక్షి చేవెళ్ల(సుధాకర్ గౌడ్) :** చేవెళ్ల మండలం కమ్మెట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల హనుమంత్ రెడ్డి గారు తిరుపతిలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 18వ ఆల్ ఇండియా రైటర్స్ వేదిక సమావేశంలో జాతీయ సేవారత్న అవార్డును అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ గారి చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. గ్రామ అభివృద్ధి మరియు సామాజిక సేవలలో ఆయన చేసిన విశేష కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను ఈ కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి సేవలను పలువురు ప్రశంసించారు. ఈ అవార్డు ద్వారా కమ్మెట గ్రామానికి జాతీయ స్థాయిలో గౌరవం లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు కూడా ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పట్లోళ్ల హనుమంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం గ్రామ స్థాయి నుండి ప్రారంభమైంది. మాజీ మంత్రి ఇంద్రా రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి ఆశయాలతో ప్రేరణ పొంది ఆయన ప్రజా సేవలోకి అడుగుపెట్టారు. తొలుత వార్డ్ మెంబర్ గా ఎన్నికై గ్రామ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని పొందారు. ఆ సమయంలోనే ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేశారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న ఆయన తరువాత సర్పంచ్ గా ఎన్నికయ్యారు. సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పలు కార్యక్రమాలు అమలు చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన నాయకత్వంలో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరిగాయి. సర్పంచ్‌గా ఉన్న సమయంలో కమ్మెట గ్రామంలో పలు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. గ్రామంలోని ప్రధాన రహదారులతో పాటు గల్లీలలో కూడా సీసీ రోడ్లను నిర్మించారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి పారిశుధ్య సమస్యలను తగ్గించారు. త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోర్ వెల్స్ మరియు పైప్ లైన్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందించేందుకు నిరంతరం కృషి చేశారు. ఈ చర్యల వల్ల గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగింది. ప్రజలు కూడా ఆయన సేవలను ప్రశంసించారు. గ్రామంలో పేదవారికి అండగా నిలిచిన నాయకుడిగా హనుమంత్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎవరికైనా ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పుడు వారికి సహాయం చేయడానికి ముందుండేవారు. పేద కుటుంబాలకు అవసరమైన సమయంలో ధన సహాయం అందించేవారు. గ్రామంలో ఎవరికైనా మరణం సంభవిస్తే వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేవారు. అంత్యక్రియల కోసం రూ.10 వేల నుండి రూ.20 వేల వరకు సహాయం అందించి మానవతా భావాన్ని చాటుకున్నారు. పేద ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరించడానికి ప్రయత్నించారు. ఈ కారణంగా గ్రామ ప్రజలలో ఆయనకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. గ్రామ ప్రజలు ఆయనను తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తారని స్థానికులు తెలిపారు.గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని కూడా హనుమంత్ రెడ్డి ప్రోత్సహించారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా అందరిని కలుపుకొని చర్చించి పరిష్కార మార్గాలు కనుగొన్నారు. గ్రామంలో శాంతి, సామరస్యాన్ని కాపాడేందుకు కృషి చేశారు. యువతను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని ప్రోత్సహించారు. గ్రామంలో సామాజిక ఐక్యత పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల మధ్య ఐక్యత పెరగడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు అయ్యాయి. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆయన పనిచేశారు. ప్రజలు కూడా ఆయనకు పూర్తి మద్దతు అందించారు. జాతీయ సేవారత్న అవార్డు అందుకున్న సందర్భంగా పట్లోళ్ల హనుమంత్ రెడ్డి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజల సహకారం లేకుండా ఈ స్థాయికి చేరుకోలేకపోయేవాడినని అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల సేవలో కొనసాగుతానని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఈ అవార్డు తనకే కాకుండా గ్రామ ప్రజలందరికీ చెందినదేనని భావోద్వేగంగా తెలిపారు

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** భాష సంయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు గారి కాశ్య విగ్రహం ప్రతిష్టించుచున్న సందర్భముగా చౌడేపల్లి బజారు వీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానము ముందర వాసవి సేవకులు ఆర్యవైశ్య మహిళా మండలి మరియు వాసవి క్లబ్ వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూజా కార్యక్రమం అనంతరం, స్వీట్స్ పంచడం జరిగినది 1901వ సంవత్సరం మార్చి 16వ తేదీన నెల్లూరు జిల్లాలో జన్మించారు 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహారదీక్ష చేసి 58రోజులు పోరాడి డిసెంబర్ 15వ తేదీన ప్రాణాలు అర్పించారు ,58 రోజులు నిరాహార దీక్ష కు గుర్తుగా 58 అడుగులు విగ్రహమును అమరావతిలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిష్టించడం జరిగిందని ఆర్యవైశ్య ప్రముఖులు అన్నారు,

# పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** పనుల వసూలను వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ అన్నారు, మండల కేంద్రమైన చౌడేపల్లి సచివాలయంలో ఈ మేరకు సచివాలయ అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం, ఏర్పాటు నిర్వహించారు పంచాయతీ అభివృద్ధి పనుల వసూళ్లలోనే ఉంటుందని ప్రతి ఒక్కరు బకాయిలు వసూలు చేసి సహకరించాలని కోరారు. ఇంటి పన్నులపై యజమానులకు అవగాహన కల్పించి వారి నుంచి వసూళ్లు చేయాలని కోరారు, అంతేకాకుండా పట్టణంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు ,మంచినీటి సమస్య తరతకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో పిడిఓ శివయ్య సచివాలయం అధికారులు పాల్గొన్నారు,

# ప్రశాంతంగా కొనసాగిన పదో తరగతి పరీక్షలు





**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి, మండలంలోని విజయ వాణి నగర్ చౌడేపల్లి పట్టణంలోని ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలందు విద్యార్థులకు పది పరీక్షల నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు, రెండు కేంద్రాలు కలిపి 557 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ముగ్గురు హాజరు కాలేదని ఎంఈఓ కేశవరెడ్డి తెలిపారు, ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయాన్నే విద్యార్థులు వారి తల్లిదండ్రులు చేరుకున్నారు, ప్రభుత్వం మేరకు ప్రతి కేంద్రం ముందు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించినట్లు ఆయన వివరించారు ,కాగా పరీక్షా కేంద్రాల వద్దకు సకాలంలో ఆర్టీసీ సేవలు లేనందున పలువురు ఇబ్బందులు పడ్డారు, పరీక్ష సమయంలోనైనా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు,

# కేజీబీవీ సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం బేసిక్ చెల్లించాలి

**దేవా గ్రూప్ జిల్లా అధ్యక్షులు గద్దం శ్రీనివాస్**




**నేటిసాక్షి/ములుగు ప్రతినిధి :** కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమమ్ బేసిక్ పే చెల్లించాలని డిఫరెంట్లీ ఏ ఓల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ములుగు జిల్లా శాఖ అధ్యక్షులు గద్దం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ)కేజీబీవీ విద్యాసంస్థలలో సేవలందిస్తున్న ఉద్యోగులకు ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోల్లో చెప్పినట్లుగా కాంట్రాక్టు విధానం ఔట్సోర్సింగ్ విధానం లేకుండా అందర్నీ పర్మినెంట్ చేస్తామని ప్రకటించి వారికి కనీస మినిమం వేతనం కూడా ఇవ్వకుండా వెట్టి చాకిరి వేయించుకుంటున్నారని ఆరోపించారు ఇప్పటికైనా దయచేసి వారికి మినిమం బేసిక్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పంచ కప్పు శ్రీనివాస్, కోశాధికారి తీగల రజిత,జమున, రఘు, ఏలేటి వెంకన్న, వెంకట నరేష్, పఠాన్ ఆస్మా బేగం, వంశీకృష్ణ పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI


# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల గర్జన

## 30న జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా



**నేటి సాక్షి మంచిర్యాల్ (శ్రీధర్ దమ్ము) :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సోమవారం సమావేశమై తమ సుదీర్ఘ కాలపు డిమాండ్లపై చర్చించింది. గత 28 సంవత్సరాల నుండి పెన్షన్ పెంపుదలకు నోచుకోని బొగ్గు గని పెన్షనర్లకు కరువు భత్యంతో కూడిన 50 శాతం పెన్షన్ పెంచాలని ఈ సమావేశం ప్రధానంగా డిమాండ్ చేసింది. అఖిల భారత బొగ్గు పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు ఈ నెల 30న న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను సింగరేణి విశ్రాంత ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 1998 వ సంవత్సరంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పెన్షన్ పెంచాల్సి ఉన్నప్పటికీ గత 28 ఏళ్లుగా ఒక్క పైసా కూడా పెంచకపోవడం వల్ల పెన్షన్ దారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వేలాది మంది పెన్షనర్లు నెలకు కేవలం 350 రూపాయల నుండి 1000 రూపాయల లోపు మాత్రమే పెన్షన్ పొందుతున్నారని ఇది ప్రభుత్వం ఇచ్చే ఉచిత ఆసరా పెన్షన్ల కన్నా తక్కువని వారు గుర్తు చేశారు. సరైన ఆర్థిక స్తోమత లేక వైద్యం అందక ఎంతో మంది విశ్రాంత కార్మికులు మరణిస్తున్నారని వారు ఆవేదన చెందారు. కేంద్ర ప్రభుత్వం మరియు కోల్ ఇండియా యాజమాన్యం తక్షణమే స్పందించి సిపిఆర్ఎంఎస్ హెల్త్ కార్డ్ ద్వారా 25 లక్షల వరకు వైద్య సౌకర్యం కల్పించాలని అలాగే 2016 నుండి పెరిగిన గ్రాడ్యుటీ సీలింగ్ 20 లక్షల రూపాయలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య ఉపాధ్యక్షులు ఏ గంగయ్య కార్యదర్శి ఎన్ అంజయ్య నాయకులు ఆర్ రమేష్ లాల్ మురహరి రమేష్ సూర్యం కె శంకర్ ఎం రాజమల్లు పులి కృష్ణ ఏ ప్రభాకర్ ముత్తె భానయ్య దుర్గం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ సమావేశాల్లో ఐకేపీ వీవోఏలకు బడ్జెట్ పెంచాలి




- రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఐకేపీ వీవోఏ ఉద్యోగులకు 20 వేలు వేతనాలు ఇవ్వాలి
- జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో ఐకేపీ వీవోఏల ఆందోళన

**నేటి సాక్షి మంచిర్యాల్ (శ్రీధర్ దమ్ము ):** ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయు) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ, ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా లిదుంపల రంజిత్ కుమార్ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయు) జిల్లా గౌరవ అధ్యక్షులులి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల హామీ ప్రకారం వీవోఏలకు రూ,ఇరవై వేలు వేతనం ఇస్తామని హామీనిచ్చింది. నేటికీ రెండు సం,లు గడుస్తున్న వీవోఏలకు ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. ఈ బడ్జెట్ సమావేశంలోనైనా ఐకేపీ వీవోఏలకు రూ, ఇరవై వేలు వేతనం ఇవ్వడానికి బడ్జెట్ కేటాయించాలి. లికుంటాల కుమార్ ఐకేపీ వీవోఏ జిల్లా అధ్యక్షులులి మాట్లాడుతూ.. ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలి. గ్రేడింగ్ విధానం రద్దు చేయాలి. రూ, ఇరవై లక్షల సాధారణ భీమా, ఆరోగ్య భీమా, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలి. గ్రామ సంఘం గ్రేడింగ్ తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వీవోఏల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలి. అర్హులైన వివోఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలి. సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి. సెర్ఫ్ నుండి వీవోఏలకు ఐడి కార్డులు ఇవ్వాలి. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలి లేకుంటే రాబోయే రోజుల్లో ఆందోళన పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో దుర్గం రాములు ఐకేపీ వీవోఏ జిల్లా కార్యదర్శి, పొట్ట పోశం జిల్లా కోశాధికారి, భీంరాజ్, రాజ్యలక్ష్మి, కవిత,మల్లీశ్వరి, సమ్మయ్య, వసంత, శ్రీనివాస్, సత్యనారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- మహాత్మా గాంధీ పేరు తొలగించడం సిగ్గుచేటు: సిద్దిపేట డీసీసీ అధ్యక్షులు ఆంక్షా రెడ్డి



**నేటి సాక్షి గజ్వేల్ :** గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు, నిరుపేద రైతులకు జీవనాధారంగా నిలుస్తున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తోందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆంక్షా రెడ్డి తీవ్రంగా విమర్శించారు. వర్గల్ మండలంలోని తునికి ఖల్సా, తునికి మక్తా, మీనాజీపేట్, శాకారం, అంబర్‌పేట గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ కూలీలతో విధాన సభలు, సమావేశాలు నిర్వహించి ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం అత్యంత దురుద్దేశపూరిత చర్య అని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహానేత మహాత్మా గాంధీ పేరును పథకం నుండి తొలగించాలనే ఆలోచన సిగ్గుచేటని విమర్శించారు. అలాగే ఉపాధి హామీ పథకానికి కేటాయిస్తున్న కేంద్ర నిధుల్లో కోత విధిస్తూ పథకాన్ని బలహీనపరచే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చాలని పేర్కొంటూ బాధ్యతలను రాష్ట్రాలపై మోపడం సరైంది కాదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపాధి కల్పించే ఈ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేసి పూర్తిగా రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. వ్యవసాయ కూలీలు, కార్మికుల హక్కులు, వ్యవసాయ అనుబంధ పనులను తొలగించడం ద్వారా జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచే చర్యలు జరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అయితే నిరుపేద రైతులు, వ్యవసాయ కూలీలు, గిరిజనులు, కార్మికులకు ఉపాధి కల్పించేందుకు అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి కోట్లాది గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించిందని గుర్తు చేశారు. ఈ పథకాన్ని రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉపాధి హామీ కూలీలతో గ్రామాల వారీగా విధాన సభలు, సమావేశాలు నిర్వహించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆంక్షా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, సర్పంచులు, ఉప సర్పంచులు విజయలక్ష్మి యాదగిరి, కొండగళ్ల గణేష్, కుమార్ యాదవ్, కుమార్, గోరెమియా, టేకులపల్లి గోవర్ధన్ రెడ్డి, గంగుమల్ల లక్ష్మి, సహదేవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు పంజాల సాయి గౌడ్, నేతలు గంగుమల్ల కొండల్ రెడ్డి, నీల శ్రీనివాస్, పాషా భాయ్, యాదగిరి, పొన్నాల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుడు మల్లేశం మృతిపై విషాదం

## కుటుంబాన్ని ఓదార్చిన మాదాసు శ్రీనివాస్

**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన కళాకారుడు, తెలంగాణ ఉద్యమకారుడు నెంటూరి మల్లేశం అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మల్లేశం కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతిని వ్యక్తం చేశారు. మల్లేశం నివాసానికి చేరుకున్న మాదాసు శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లేశం తెలంగాణ ఉద్యమ సమయంలో కళాకారుడిగా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఉద్యమానికి సేవలందించిన ఒక కళాకారుడు ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని ఆయన అన్నారు. మల్లేశం కుటుంబం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం కూడా ఈ కుటుంబాన్ని ఆదుకుని తగిన ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు. అలాగే ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కళాకారులు మరియు ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిపల్లి గ్రామ సర్పంచ్ పోసాని రమేష్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, యాదగిరి, నరేష్, భాస్కర్ తదితరులు పాల్గొని మల్లేశం కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# శిథిలావస్థలో పాఠశాల గదులు

## కూల్చివేతకు అనుమతి..కొత్త నిర్మాణాలకు సన్నాహాలు



**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. రామకృష్ణ, మండల విద్యాధికారి గంగుల నరేశం పరిశీలించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాడైన గదులను కూల్చివేసి, వాటి స్థానంలో కొత్త తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా అయిలాపూర్, సర్పరాజ్‌పూర్, కల్లూరు మండల పరిషత్ పాఠశాలలను అధికారులు సందర్శించి శిథిలావస్థలో ఉన్న గదులను సమీక్షించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు సర్పరాజ్‌పూర్, కల్లూరు పాఠశాలల్లో ఒక్కో తరగతి గదిని, అయిలాపూర్ పాఠశాలలో ఆరు గదులను కూల్చివేసేందుకు అనుమతి లభించిందని తెలిపారు. పాడైన గదులను తొలగించిన అనంతరం వాటి స్థానంలో నూతన తరగతి గదుల నిర్మాణం చేపట్టి త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు సూచించారు. విద్యార్థులు సురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసించేలా చర్యలు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అయిలాపూర్ సర్పంచ్ రామకృష్ణ, సర్పరాజ్‌పూర్ సర్పంచ్ రాజ్‌కుమార్, కల్లూరు సర్పంచ్ చిట్నేని లత-రమేష్, ప్రధానోపాధ్యాయులు నర్సింహమూర్తి, కిష్టయ్య, నరహరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు తీసుకున్న నిర్ణయాలను వారు స్వాగతిస్తూ, పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.


# ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**నేటి సాక్షి ,మంచిర్యాల జిల్లా:** రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ట్రైని డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పౌర సంబంధాల అధికారి కృష్ణమూర్తి, మండల తహసిల్దార్ రఫతుల్లా, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గానికి 3 లక్షల రూపాయలు అందించడం జరిగిందని, త్వరలో తోఫా కిట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ మత సామరస్యంతో సమాజాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.

# గ్యాస్ సిలిండర్ ధరల పెంపుపై సిపిఐ నాయకుల నిరసన



**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్ ధరల పెంపుపై సిపిఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ ): పిలుపుమేరకు గన్నేరువరం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ రెండు దేశాల ఇరాన్ పై దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మండల కేంద్రంలో సిపిఐ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చుక్కల శ్రీశైలం జిల్లా కౌన్సిల్ సభ్యులు కంతాల అంజిరెడ్డి సహాయ కార్యదర్శి పిప్పళ్ళ కనకయ్య కూన మల్లయ్య గ్రామ శాఖ కార్యదర్శి బొమ్మకంటి ఆంజనేయులు చారి మండల నాయకులు ఎండి రాపోలు రాయమల్లు చుక్కల శ్రీనివాస్ సామా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అమలు కాని హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బిజెపి

- కోరుట్లలో బీజేపీ నిరసన.. ఎమ్మార్వోకు వినతి పత్రం
- ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు



**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా వంటి కీలక హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వం మీద నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని, ముఖ్యంగా రైతులు ఆర్థిక ఇబ్బందులతో అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో అనేక మంది అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆసరా పెన్షన్లు అందడం లేదని పేర్కొంటూ, వారి దరఖాస్తులను వెంటనే ఆమోదించి పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని ఎమ్మార్వోను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కస్తూరి లక్ష్మీ నారాయణ, ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్, చెట్లపెల్లి సాగర్, ఉపాధ్యక్షులు మైదం సత్యనారాయణ, గిన్నెల శ్రీకాంత్, పోతుగంటి శ్రీనివాస్, బీజేవైఎం అధ్యక్షుడు కలాల సాయిచంద్, సహా పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ అసెంబ్లీలో వందేమాతరం వివాదం



- ఎంఐఎం వాకౌట్‌పై బీజేపీ ఆగ్రహం
- వందేమాతరం గీతానికి అవమానం జరిగిందని విమర్శలు
- దేశభక్తి విలువలను కాపాడాలని బీజేపీ నేతల డిమాండ్

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** తెలంగాణ అసెంబ్లీలో వందేమాతరం గీతం ఆలపిస్తున్న సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు వాకౌట్ చేయడంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను జాతీయ గౌరవానికి అవమానంగా అభివర్ణిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కించపరిచే చర్యగా ఖండించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్ మాట్లాడుతూ, అసెంబ్లీలో వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో ఎంఐఎం సభ్యులు బయటకు వెళ్లిపోవడం అత్యంత సిగ్గుచేటు అని అన్నారు. ఇది సాధారణ నిరసన కాదని, దేశ గౌరవాన్ని దెబ్బతీసే చర్య అని తీవ్రంగా విమర్శించారు. చట్టసభల్లో పదవులు అనుభవిస్తూ జాతీయ గీతానికి గౌరవం ఇవ్వకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. దేశంలో ఉంటూ వందేమాతరం గీతాన్ని గౌరవించని వారికి ఇక్కడ స్థానం లేదని, ఇటువంటి చర్యలు రాజ్యాంగ విలువలను దిగజార్చుతున్నాయని ఆయన అన్నారు. ఈ ఘటనతో ఎంఐఎం పార్టీ అసలు స్వరూపం ప్రజలకు వెల్లడైందని పేర్కొన్నారు. ప్రజలు దేశభక్తిని కాపాడే నాయకులను మద్దతు ఇవ్వాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు.


# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి సాక్షి ,మంచిర్యాల జిల్లా:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారం పై అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్యతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ యూనియన్ ప్రతినిధులు దేవేందర్, రజిత తమ దరఖాస్తులో ఎం సి సి ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ లకు గత 10 నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను ప్రస్తుత నిత్యవసరాల దృష్ట్యా పరిశీలించి అందించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలోని 17వ వార్డు షంషేర్ నగర్ స్కూల్ చెందిన లక్ష్మణరావు తమ ప్రాంతంలోని ప్రభుత్వ వాటర్ ట్యాంక్ ను మున్సిపల్ అధికారుల సమన్వయం లేకుండా కూల్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జి సమర్పించారు. మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన కోట లక్ష్మి తన భర్త వికలాంగుడని, తన కుమారుడు [illegible]వ తరగతి చదువుతూ గురుకుల పరీక్ష రాసాడని, సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని కొత్తూరు గ్రామ రైతులు తాము గత సీజన్ లో పండించిన సన్న రకం వడ్లు కొనుగోలు కేంద్రాలలో విక్రయించామని, ఇందుకు గాను బోనస్ డబ్బులు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తాండూర్ మండలం మాదారం గ్రామానికి చెందిన మహమ్మద్ ముజాహద్ హుస్సేన్ గ్రామ శివారులో తనకు గల భూమి నుండి కొంత భాగాన్ని ఇతరుల పేరుట అక్రమంగా పట్టా చేశారని, ఈ పట్టాను రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి మత్స్య సహకార సంఘం సభ్యులు ఎన్నికలను నూతన సభ్యుల పేర్లు నమోదు చేసే వరకు నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన ఆలం మల్లేష్ తమ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూమిని వారు మరణించినందున వారసలమైన తమ పేరిట మార్చాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన దుర్గమ్మ నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు అనంతరం ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆయా కార్యాలయాల సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని తెలిపారు. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులములు, షెడ్యూల్ తెగల వసతి గృహాలలో ఏమైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. నీటిపారుదల, వ్యవసాయం, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలపై దృష్టి సారించాలని, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో లోతట్టు ప్రాంతాలలో వరదల [illegible]రణంగా ఇబ్బందులకు గురయ్యే గృహ నివాసాలను గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమర్పించే నివేదికల ఆధారంగా ప్రజా ప్రయోజనార్థం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# బీసీ ఎస్సీ ఎస్టీల ఐక్యతతోనే సామాజిక న్యాయం



బీసీ జెఏసీ నేత సిద్ది రమేష్

**నేటి సాక్షి,మంచిర్యాల జిల్లా:** మంచిర్యాల జిల్లాలో బీసీ జెఏసీ రాష్ట్ర నాయకుడు సిద్ది రమేష్ ఒక ప్రకటనలో బీసీ ఎస్సీ ఎస్టీ మరియు అణగారిన వర్గాల ఐక్యతను చాటారు. దుగ్నపల్లి ఉప సర్పంచ్ గంద్రకోట మల్లయ్య యాదవ్ కుమారుని వివాహ వేడుకలో బీసీ ఎస్సీ నాయకులు ఒకే వేదికపై ఉండటం ఆనందదాయకమని పేర్కొంటూనే ఈ ఐక్యతను ఓర్చుకోలేని శక్తుల తీరును ఆయన తప్పుబట్టారు. కత్తెరసాల సర్పంచ్ ఎన్నికల అంశాన్ని ప్రస్తావిస్తూ చెన్నూర్ మండలంలోని ముప్పై గ్రామ పంచాయతీలలో కేవలం రెండు స్థానాలు మాత్రమే బీసీలకు కేటాయించడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో బీసీల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ రాజకీయ ప్రాతినిధ్యం తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి గారు జనరల్ స్థానంలో బీసీ అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ తరఫున బలపరచడాన్ని ఒక సామాజిక ఉద్యమకారుడిగా తాను స్వాగతించానని మరియు ఆ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేసినట్లు తెలిపారు. అయితే బీసీలు ఐక్యంగా ఉండటం జీర్ణించుకోలేని కొంతమంది అగ్రవర్ణ నాయకులు తనపై దాడులు చేయించేందుకు కుట్రలు పన్నుతున్నారని రమేష్ ఆరోపించారు. ఒక వ్యక్తి తన సామాజిక వర్గానికి మద్దతు ఇవ్వడం ప్రజాస్వామ్య హక్కు అని ఆయన గుర్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరుతో బీసీల అవకాశాలు తగ్గిపోతున్న తరుణంలో మన హక్కుల కోసం పోరాడకపోయినా పర్వాలేదు కానీ హక్కులను హరిస్తున్న వారికి తొత్తులుగా మారవద్దని ఆయన పిలుపునిచ్చారు. అంబేద్కర్ మరియు పూలే వంటి మహనీయుల ఆశయాల బాటలో సామాజిక న్యాయం కోసం మన శక్తి మన ఐక్యతలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి మరియు రాజకీయంగా ఎదగడానికి గ్రామపంచాయతీ నుండి పార్లమెంట్ వరకు బీసీ నాయకులు చైతన్యంతో ముందుకు రావాలని ఆయన కోరారు. మన పోరాటం వ్యక్తుల మీద కాదని కేవలం అన్యాయం మీదనేనని పేర్కొంటూ అణగారిన వర్గాలన్నీ ఒకటిగా నిలబడి మన గౌరవాన్ని కాపాడుకుందామని సిద్ది రమేష్ పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి సాక్షి,మంచిర్యాల జిల్లా:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో గల ఆదర్శ పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న మధ్యాహ్న భోజనం ఆహారం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. బాలికల వసతి గృహంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం హాజీపూర్ మండలం గుడిపేట లోని చందనాపూర్ లో గల పట్టణ ఆవాస పాఠశాలను సందర్శించి పాఠశాలలో చేపట్టిన అదనపు గదులు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వంటశాలను సందర్శించి విద్యార్థుల ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని తెలిపారు.

# కోర్టు వాయిదాలకు ఎగనామం

## కొండాంపేటకు చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్



**నేటి సాక్షి,మంచిర్యాల జిల్లా :** మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నమోదైన పాత నేరంలో కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేసు వివరాల్లోకి వెళ్తే గత 2024 సంవత్సరంలో కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో కొండాంపేట గ్రామానికి చెందిన కారడ కుమార్ అలియాస్ కొమురయ్య మరియు కారడ బాపు నిందితులుగా ఉన్నారు. వీరిద్దరూ కేసు నమోదైనప్పటి నుండి కోర్టు వాయిదాలకు సరిగా హాజరుకాకుండా పోలీసుల కళ్ళు గప్పి తప్పించుకు తిరుగుతున్నారు. వీరి ప్రవర్తనను గమనించిన చెన్నూరు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వీరిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోటపల్లి పోలీసులు పక్కా సమాచారంతో నిందితులను సోమవారం పట్టుకున్నారు. అనంతరం వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా కోర్టు వారికి రిమాండ్ విధించిందని ఎస్ఐ పేర్కొన్నారు.

# ఆరు గ్యారంటీలు పెద్ద మోసం

## బీజేపీ మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్



**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. సోమవారం బీజేపీ మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నికేష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలను రెండేళ్లయినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు 2500 రూపాయలు మరియు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. రైతు భరోసా పథకానికి అనేక కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల వేళ 15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇప్పుడు దాన్ని 12 వేలకు కుదించడమే కాకుండా రైతు కూలీలకు ఇచ్చే సాయాన్ని కూడా విస్మరించారని ధ్వజమెత్తారు. యువ వికాస్ పథకం కింద ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు మరియు అంతర్జాతీయ పాఠశాలల ఏర్పాటు ఊసే లేదని ఆయన విమర్శించారు. పెన్షన్ దారులకు 4000 రూపాయలు ఇస్తామని చెప్పి వారిని కూడా దగా చేశారని పెన్షన్లు పెంచడానికి హస్తం పార్టీకి చేతులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మరియు తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాల పంపిణీని ప్రభుత్వం అటకెక్కించిందని ఆరోపించారు. గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును తూతూమంత్రంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయలేని ఈ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ ఏలేటి చంద్రారెడ్డి మరియు ఇతర పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలోని 17వ వార్డులో కళ్యాణ లక్ష్మీ పథకం కింద లబ్ధిదారులకు చెక్కులను కౌన్సిలర్ సోగ్రబి-అక్బర్ స్వయంగా ఇంటికి వెళ్లి అందజేశారు. ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా అర్హులైన కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 17వ వార్డుకు చెందిన పులిపాక లక్ష్మీరాజు కుమార్తె ఇటీవల వివాహం జరగగా, ఆమెకు కళ్యాణ లక్ష్మీ పథకం కింద ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు ప్రక్రియను కౌన్సిలర్ సోగ్రబి అక్బర్ దగ్గరుండి పూర్తి చేయించారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును వారి నివాసానికి వెళ్లి స్వయంగా అందజేశారు. ఇలాంటి ఆర్థిక సాయం మునుపెన్నడూ లేని విధంగా వేగంగా మంజూరు కావడం పట్ల సోగ్రబి అక్బర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్, జువ్వాడి కృష్ణారావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపయోగపడేలా నిరంతరం కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.

## గంజాయి పట్టివేత

**నేటిసాక్షి, నల్లబెల్లి:** గంజాయి తరలిస్తున్న యువకులను పట్టుకున్న సంఘటన మండలంలోని శనగరం మూల వలపు వద్ద చోటుచేసుకుంది ఎస్ఐ వి గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో శనిగరం క్రాస్ రోడ్డు జాతీయ రహదారి 365 వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా సుమారు 951 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిలో దుగ్గొండి మండలం రెబల్లె, వెంకటాపూరం కీచెందిన పేరబోయిన అనుర్వేశ్ యాదవ్ (17), కక్కెర్ల అభిరామ్ (19)గుర్తించామన్నారు . వీరు ఒడిశా ప్రాంతం నుండి గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు విచారణలో వెల్లడైందని గంజాయి, మరియు రెండు మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకొని ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## గడి బురుజుల వద్ద భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలి



**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణానికి తలమానికంగా నిలిచిన గడి బురుజుల వద్ద భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని 28వ వార్డు కౌన్సిలర్ కొక్కెర వెంకటేష్ మున్సిపల్ అధికారులను కోరారు. పట్టణ గౌరవాన్ని మరింత పెంచేలా హైమాస్ట్ నేషనల్ ఫ్లాగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కోరుట్ల పట్టణంలోని 28వ వార్డులో ఉన్న గడి బురుజుల చారిత్రక కట్టడం ప్రత్యేక గుర్తింపును కలిగి ఉందని వెంకటేష్ తెలిపారు. ఇప్పటికే ఈ కట్టడం జాతీయ జెండా రంగులతో అలంకరించబడుతూ ప్రజలను ఆకట్టుకుంటోందని, ఇక్కడ భారీ జాతీయ జెండా ఏర్పాటు చేస్తే పట్టణానికి మరింత ప్రతిష్ఠ తీసుకువస్తుందని పేర్కొన్నారు.సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కొక్కెర వెంకటేష్, మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ మహ్మద్ షాహిద్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో పట్టణంలో ఒక ప్రముఖ ప్రదేశంలో ఎత్తైన జాతీయ జెండా ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు.అదేవిధంగా గడి బురుజుల వద్ద హైమాస్ట్ జాతీయ జెండా ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు రావడంతో పాటు పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందని వెంకటేష్ అభిప్రాయపడ్డారు. పట్టణ ప్రజల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## 3లక్షల50వేల వ్యయంతో సీసీరోడ్లు



**నేటిసాక్షి న్యూస్ తిరుమలయపాలెం (మెట్టు రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తండా గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా ఇస్లావత్ తండా లో సర్పంచ్ ఇస్లావత్ సునీత (రవి) ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి గ్రామంలోని రహదారి సమస్యలను పరిష్కరించేందుకు సుమారు మూడు లక్షల 50 వేల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు ఈ సందర్భంగా సర్పంచ్ ఇస్లావత్ సునీత మాట్లాడుతూ ప్రజా పాలన ప్రాణాలిక ద్వారా గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని గ్రామ ప్రజల సహకారంతో ఇస్లావత్ తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు సిసి రోడ్లు నిర్మించడం వల్ల వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని తండావాసులకు సర్పంచ్ సునీత వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత (రవి), ఉపసర్పంచ్ ఇస్లావత్ రమేష్, కార్యదర్శి భూక్య సురేష్, వార్డు సభ్యులు ఇస్లావత్ ధర్మ ,ఇస్లావత్ లక్ష్మణ్, ఇస్లావత్ రామారావు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**నేటి సాక్షి, మంచిర్యాల జిల్లా:**అధికారులు తమ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనార్థం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కార్మికులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఉపాధి కూలీలకు సకాలంలో కూలీ డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించి ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, చెత్త సేకరణ, శుభ్రత నిర్వహణ, గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక వందన పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత లను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు, నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్దేశిత విస్తీర్ణంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇందిరమ్మ ఇల్లు కేటాయించబడి నిర్మాణం చేపట్టని మహిళతో ఇల్లు నిర్మించుకునేలా ప్రోత్సహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# వేంపెంటలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



- ప్రారంభించిన మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ సింగపూర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూమి పూజను తిలకిస్తున్న సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు

**నేటి సాక్షి ,పాములపాడు:**పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన సుంకులమ్మ కొట్టాలలో పల్లె పండగ రెండవ విడతలో భాగంగా 11 లక్షలతో, జజ రోడ్ల నిర్మాణానికి మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ, నాయకులతో కలిసి భూమి పూజ చేసి, పనులను ప్రారంభించడం జరిగింది. సింగపూర్ దేశంలోని, మా ఇంటి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసి రోడ్డు భూమి పూజ కార్యక్రమాన్ని తిలకించడం జరిగిందని తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేగూర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సమాజ సేవకుడు & వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు డాక్టర్ టేకురి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో సిసి రోడ్లు చాలా ముఖ్యమైనవని, ప్రతి వీధికి మంచి రోడ్లు ఉంటే అందంగా, గ్రామ ప్రజలకు విష సర్పాలు కుట్టకుండా మంచి రక్షణగా ఉంటాయన్నారు. తమ కుటుంబం గ్రామాభివృద్ధిలో అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, నీటిసంఘం వైస్ ప్రెసిడెంట్ (డీసీ)ఆల్ఫ్రెడ్, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, వేమా రెడ్డి, రమేష్ రెడ్డి, సుంకన్న, బోనాల భాస్కర్, రాముడు, మహానంది, నాగేశ్వర నాయక్, దార జీవన్న, నారాయణ రెడ్డి, ప్రసన్న కుమార్, హుస్సేన్, పెద్ద రాజయ్య, మొగిలి శ్రీను, హుస్సేనయ్య, చిన్న సుబ్బయ్య, జనసేన శేషు, హుసేన్నలం, సురేంద్ర గౌడ్, రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

# కళారత్న నేషనల్ అవార్డ్ అందుకున్న నక్క పోచ రాజయ్య

- బహుజన సాహితీ వేత్తలను గుర్తించడమే మన బి.ఎస్.ఎ. లక్ష్యం
- సౌత్ ఇండియా నేషనల్ కాన్ఫరెన్స్ లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ
- తెలంగాణ అమర వీరుల త్యాగాలను చాటి చెప్పిన డా.దరువు ఎల్లన్న



**నేటి సాక్షి జగిత్యాల జిల్లా :** బుగ్గారం మండల కేంద్రానికి చెందిన నక్క పోచ రాజయ్య (నక్క రాజు) ఆదివారం సాయంత్రం తిరుపతి లోని జి.ఎస్.కె.ఆర్. భవన్ లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా "కళారత్న నేషనల్ అవార్డ్" అందుకున్నారు. బహుజన జాతీయవాది మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి సందర్భంగా తిరుపతిలో 18వ జాతీయ స్థాయి సాహితీ వేత్తల సదస్సు, అవార్డుల ప్రధానోత్సవ సభను బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. దాదాపు గత రెండు దశాబ్దాలుగా నక్క పోచ రాజయ్య (నక్క రాజు)చేస్తున్న కళా ప్రదర్శనలు, ఆధ్యాత్మిక, ఉద్యమ కళా ప్రదర్శనలు, 24 గంటల నిర్విరామ గాన స్వరాభిషేకం, తెలంగాణ ఉద్యమ కారునిగా అందించిన ఉద్యమ కార్యక్రమాలు, నేటికీ సమాజ హితం కోసం ఆయన చేస్తున్న ప్రజా అవగాహన కార్యక్రమాలను, సదస్సులను, యువత గంజాయి, డ్రగ్స్ లకు అలవాటు పడుతున్న నేపథ్యంలో వాటి నివారణ కోసం సదస్సులు, మహిళలకు, బాలికలకు భరోసా లాంటి కార్యక్రమాలను నిర్వహించడం లాంటి అతని గొప్ప కలలను గుర్తించి ఈ "కళారత్న నేషనల్ అవార్డ్" అందించడం జరిగిందని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ తెలిపారు. బహుజన సాహితీ వేత్తలను గుర్తించడమే మన బి.ఎస్.ఎ. లక్ష్యం అని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దరువు ఎల్లన్న మాట్లాడుతూ ఈ తెలంగాణ అమర వీరుల త్యాగాలను చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి తదితర రాష్ట్రాల డెలిగెట్స్ తో పాటు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన బహుజన సాహిత్య అకాడమీ ప్రతినిధులు, పలువురు ప్రముఖులతో పాటు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటి మెంబర్ డా.దరువు ఎల్లన్న, తెలంగాణ రాష్ట్ర కో - ఆర్డినేటర్ విష్ణు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కనుకుట్ల విజయ కుమార్, ప్రముఖ అంబేద్కరిస్ట్ ఉద్యమ నాయకులు మామిడిపల్లి బాపన్న, ప్రముఖ రచయిత, కర్ణాటక రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.డి.వెంకమ్మ, కేరళ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కళారాణి, తమిళనాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి రాజేషన్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఎన్. వర ప్రసాద్ లతో పాటు వివిధ రాష్ట్రాల, జిల్లాల బాధ్యులు, జాతీయ అవార్డుల సెలెక్షన్ కమిటి సభ్యుడైన సేవా రత్న అవార్డు గ్రహీత, ప్రముఖ ఉద్యమ కారులు చుక్క గంగారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి

### మేడిపల్లి మండల ఎంపీడీఓ

**నేటి సాక్షి-మేడిపల్లి :** మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన మేడిపల్లి మండల ఎంపీడీవో గంగాధర్, ఏఈ వందన, పంచాయతీ సెక్రెటరీ రాణ ఇషాక్, వైయస్ శ్రీనివాస్ గౌడ్, కారోబార్ ప్రసాద్, పాల్గొన్నారు ఇందిరమ్మ ఇండ్లు ఈనెల 30 తారీఖు లోపు అందరూ నిర్మించుకొని గృహప్రవేశం చేసుకోవాలని ఎంపీడీవో తెలియజేసారు నిర్మాణ దశలో అసంపూర్తిగా ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు బిల్లుల విషయంలో ఆలస్యం అయితే తమ దృష్టికి తెలియజేయాలని తెలిపారు.



## రాజారం గ్రామ లో ప్రజా పాలన

ప్రగతి ప్రణాళిక అభివృద్ధి కార్యక్రమాలు




**నేటిసాక్షి న్యూస్ తిరుమలయపాలెం, (మెట్టు రుద్రరాజు) :** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామపంచాయతీలో సర్పంచ్ మందుల అరుణ (ఎ/శీఈదయ్యా)

కార్యదర్శి ఉష ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మందుల అరుణ కార్యదర్శి ఉష మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఎంతో ఉపయోగకరంగా ఉందని ఈ కార్యక్రమాల ద్వారా గ్రామంలో పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలు మెరుగుపడడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గ్రామాన్ని ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నామని అన్నారు .గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే ఉత్తమ గ్రామపంచాయతీగా నిలపడడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత పుస్తకాల పంపిణీ



**నేటి సాక్షి, చేర్యాల :** చేర్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. కె. ప్రణీత 1, 3,5,సెమిస్టర్ పరీక్షలలో 70% శాతం పైన మార్కులతో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2.4.6 రాబోయే పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని కళాశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్ల ఆకస్మిక తనిఖీ..

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు లింగ నిర్ధారణ చేస్తే జైలు శిక్ష: డీఎంహెచ్ఓ రజిత..



**నేటి సాక్షి సిరిసిల్ల (శివకుమార్):** సిరిసిల్ల పట్టణము యందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రాజిత మరియు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ నాగేంద్రబాబు అధ్యక్షతన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించినారు. ఈ తనిఖీలలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులను ప్రతి రేడియాలజిస్ట్ రెండు హాస్పిటల్లో స్కానింగ్ మాత్రమే చేయవలసిందిగా సూచిస్తూ, ఫారం ఎఫ్ ఆడిట్లో గర్భిణీ స్త్రీల రిఫరల్ స్లిప్ మరియు స్కానింగ్ ఫిలిం ఫారం ఎఫ్ నకు జతపరచవలసిందిగా, స్కానింగ్ సర్టిఫికెట్లు లో నమోదు అయిన మిషన్ యొక్క నెంబర్, స్కానింగ్ మిషన్ నెంబర్ సరితూగునట్లుగా ఉండాలని సూచిస్తూ, గర్భస్థ పూర్వ పిండ లింగ నిర్ధారణ నిషేధితమని ఒకవేళ స్కానింగ్ నిర్వాహకులు, రేడియాలజిస్టు తెలిపిన వారు పి సి పి ఎన్ డి టి చట్టం ప్రకారం 10,000 రూపాయల జరిమానా తో పాటు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తామని ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సూచించినారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో రాజకుమార్ పాల్గొన్నా

## పేదవారి కల - ఇందిరమ్మ ఇల్లు

ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు



నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని నూర్ నగర్ (వార్డు–12)లో ఇంటి స్లాబ్ పనులను కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదలకు గృహ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు స్థిరమైన నివాస సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, మాజీ ఎంపీపీ బాలేశ్ గౌడ్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు, రాపర్తి కార్తీక్, రాజంపేట వార్డు సభ్యుడు గులాం జావిద్, ఆసిఫాబాద్ మైనారిటీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఆసద్, నూర్ నగర్ నాయకుడు జమీర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు షాహిద్తో పాటు నూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కథలాపూర్‌లో బీజేపీ రాస్తారోకో..

## తహసీల్దార్‌కు వినతి పత్రం

- రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలుపై డిమాండ్
- రైతు, యువత సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ ఆందోళన





**నేటి సాక్షి - కథలాపూర్,( రాధారపు నర్సయ్య ):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కథలాపూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలు కోసం గళమెత్తారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించి ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కథలాపూర్ మండల శాఖ అధ్యక్షుడు మల్యాల మారుతి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు రహదారిపై బైఠాయించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, మల్యాల మారుతి, యువమోర్చ నాయకుడు కాసోజీ ప్రతాప్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అంశాలు ఇప్పటికీ అమలుకాకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వంపై నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలను నిరాశపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కథలాపూర్ మండలంలోని రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందకపోవడంతో పెట్టుబడుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు కష్టాల్లో మగ్గుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బద్రి సత్యం, బండ అంజయ్య, పిడుగు ఆనంద్ రెడ్డి, సర్పంచులు మల్యాల రమేష్, చిందం సుధాకర్, కంటే రాజం, నరెడ్ల రవి, కథలాపూర్ మహేష్, గడ్డం జీవన్ రెడ్డి, జిల్లా సత్యం, వొడ్డెటి సునీల్, ఉపసర్పంచ్ బొమ్మ మధు, పచ్చిమట్ల గంగాధర్, దారావత్ రాంసింగ్, లోక్య నాయక్, కల్లెడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

## కలెక్టర్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



**నేటి సాక్షి మహబూబాబా ద్ :** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్‌ను డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కురవి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మరియు వివిధ గ్రామాల సర్పంచులతో కలిసి జిల్లా పరిపాలన కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో గ్రామాల అభివృద్ధికి ఎదురవుతున్న అడ్డంకులపై చర్చించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పెండింగ్ బిల్లుల విడుదల మరియు తాగునీరు రహదారులు డ్రైనేజీ వంటి ప్రాథమిక వసతుల కల్పన కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే సర్పంచులకు సరైన మద్దతు అందిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచులు మరియు నాయకులు తెలిపిన సమస్యలను సానుకూలంగా విన్న కలెక్టర్ స్నేహశబరీష్ సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలోకి చేరేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కురవి మండల పరిధిలోని పలువురు సర్పంచులు మరియు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొని తమ గ్రామాల సమస్యలను వివరించారు.

# ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక పక్కాగా అమలు చేయాలి



- లక్ష్యం ప్రకారం ముందుకు వెళ్లాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై సమీక్ష

**నేటి సాక్షి సిరిసిల్ల (శివకుమార్):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు 99 రోజుల పాటు లిప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలి కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లిప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలిలో భాగంగా జిల్లా అధికారి తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పథకాలు అమలు చేయాలని, లక్ష్యం ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మహిళా సంఘాల భవనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. తమ పరిధిలోని అన్ని అంశాలపై యాక్షన్ ప్లాన్ అమలు చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.సమావేశంలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి రుక్మిణమ్మ



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** చౌడేపల్లికి చెందిన ఏ రుక్మిణమ్మ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రమహిళా విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. మాజీ మంత్రి మరియు ప్రస్తుత శాసనసభ్యులు డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో తనకు ఈ పదవి దక్కడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ని ఆమె మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రుక్మిణమ్మ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతం కోసం నిస్వార్థంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన నియామకం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ తన పిలుపు మేరకు తిరుపతికి తరలివచ్చిన అభిమానులకు మరియు కార్యకర్తలకు ఆమె పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో మహిళా విభాగం ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తానని ఆమె పేర్కొన్నారు.